# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ బుధవారం 12-10-2022 RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :29 సంచిక: 60 పేజీలు:6 వెల: రూ.1/-


## గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష.. 10:15 గంటల తర్వాత నో ఎంట్రీ

హైదరాబాద్, అక్టోబర్ 11: గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు కఠిన నిబంధనలు అమలు చేయనున్నట్లు టీఎస్‌పీఎస్సీ తెలిపింది. ఒకరికి బదులు మరొకరు పరీక్షకు హాజరైతే కమిషన్ నుంచి శాశ్వతకాలం డీబార్ చేయనున్నది. ఈ నెల 16 ఉదయం 10.30 గంటల నుంచి నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ పరీక్ష జరుగుతుంది. పరీక్షకు పావుగంట ముందే గేట్ క్లోజ్ చేస్తారు. అంటే.. 10.15 తర్వాత పరీక్ష కేంద్రంలోకి అభ్యర్థులను అనుమతించరు. పరీక్ష హాల్‌లోకి వెళ్లిన తర్వాత పరీక్ష ముగిసే వరకూ బయటికి వెళ్లే అవకాశం లేదు. ఓఎంఆర్ షీట్‌లో వైట్‌నర్, చాక్‌పౌడర్, ఎరైజర్, బ్లేడు వంటివి ఉపయోగిస్తే ఆ జవాబు పత్రాన్ని డిస్‌క్వాలిఫైగా పరిగణిస్తారు. పరీక్ష కేంద్రంలో బూట్లతో అనుమతించబోమని, అభ్యర్థులు చెప్పులతోనే హాజరుకావాలని కమిషన్ సూచించింది. మెహిందీ, టాటూలు వంటివి కాళ్లు, చేతులపై అలంకరించుకొని రావద్దని తెలిపింది. ఓఎంఆర్ నింపేటప్పుడు నిబంధనలు తప్పకుండా పాటించాలని కమిషన్ తెలిపింది. బుక్‌లెట్ సిరీస్ నంబర్ ఓఎంఆర్‌లో సరిగా రాయాలని సూచించింది. సిరీస్ సరిగా రాసి, వృత్తాల్ని నిబంధనల ప్రకారం నింపకుంటే ఆ ఓఎంఆర్‌ను డిస్‌క్వాలిఫై చేస్తామని హెచ్చరించింది. అభ్యర్థుల నుంచి బయోమెట్రిక్ తీసుకున్న తర్వాత ప్రిలిమినరీ పరీక్షకు అనుమతిస్తారు. మెయిన్స్ పరీక్షకు వచ్చినప్పుడు తప్పనిసరిగా ప్రిలిమ్స్ బయోమెట్రిక్‌తో సరిపోవాలి. అప్పుడే మెయిన్స్ పరీక్ష రాసే అవకాశం కల్పిస్తారు.

## స్వంత ప్రయోజనం కోసమే రాజగోపాల్ రాజీనామా : మంత్రి సబితా ఇంద్రారెడ్డి



నల్గొండ, అక్టోబర్ 11:మునుగోడు నియోజకవర్గం నాంపల్లి మండలం పసునూర్ గ్రామంలో ఎన్నికల ప్రచారంలో మంత్రి సబితా ఇంద్రారెడ్డి, మాజీ మంత్రి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. మంత్రి సబితా మాట్లాడుతూ.. మునుగోడులో టీఆర్ఎస్ భారీ మెజారిటీతో గెలుస్తుందని, గ్రామాల్లోకి వెళ్తుంటే కారు గుర్తుకు ఓటేసి అభివృద్ధికి పట్టం కట్టాలని ప్రజల్లో కమిట్మెంట్ కనిపిస్తుందన్నారు. మునుగోడులో టీఆర్ఎస్ గెలిచిన తర్వాత సమస్యలు అన్ని పరిష్కారం అవుతాయన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలోనే మునుగోడు అభివృద్ధి జరుగుతుందన్నారు. ఫ్లోరైడ్ ను రూపు మాపి సురక్షిత నది జలాలు అందించిన ఘనట ముఖ్యమంత్రి కేసీఆర్ కే దక్కుతుందన్నారు. బీజేపీ అభ్యర్థి రాజగోపాల్ రెడ్డి తన స్వార్థం కోసం రాజీనామా చేశారన్నారు. ప్రజలు ఏకమై బీజేపీకి బుద్ధి చెప్పాలన్నారు.

# ఆ రూ. 18 వేల కోట్లు ఇస్తే పోటీ నుంచి తప్పుకుంటాం.. తేల్చిచెప్పిన కేటీఆర్




హైదరాబాద్, అక్టోబర్ 11: కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి రూ. 18 వేల కోట్ల కాంట్రాక్ట్‌ను కట్టెబెట్టిన మాదిరిగానే.. మా నల్లగొండ జిల్లా అభివృద్ధికి కూడా ఆ స్థాయిలో నిధులు ఇవ్వండి.. పోటీ నుంచి తప్పుకుంటామని టీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తేల్చిచెప్పారు. ఈ విషయంలో మంత్రి జగదీశ్ రెడ్డి నిన్న చేసిన మాటలకు టీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కట్టుబడి ఉంటానని కేటీఆర్ స్పష్టం చేశారు.

తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన టీఆర్ఎస్‌వీ విస్తృత స్థాయి సమావేశంలో కేటీఆర్ ప్రసంగించారు. మీలో ఉత్సాహాన్ని, ఉప్పొంగుతున్న జోష్ చూస్తుంటే బరాబర్ మునుగోడులో గెలుస్తామన్న విశ్వాసం కలిగింది. ఉద్యమాల్లో రాటు దేలిన నాయకులు మీరు. తెలంగాణ ఉద్యమాన్ని ముందుండి నడిపించారు. ఉద్యమంలో బాగా పని చేసింది విద్యార్థి నాయకులు. ఎన్నికల గురించి, పోరాటాల గురించి నేను మీకు కొత్తగా చెప్పాల్సిన అవసరం లేదని కేటీఆర్ పేర్కొన్నారు.

ఈ దేశంలో, రాష్ట్రంలో ఏం జరుగుతుందో ప్రతి ఒక్కరూ ఆలోచించాలి. అవగాహన పెంచుకోవాలి. ప్రజలకు వివరించాలని కేటీఆర్ సూచించారు. మునుగోడు ఉప ఎన్నిక కేవలం ఒక్క కారణంతోనే వచ్చింది. ఒక కాంట్రాక్టర్ బలుపు కారణంగానే వచ్చింది. రూ. 18 వేల కోట్ల కాంట్రాక్ట్ ఇచ్చి, ఆయనను లోబర్చుకుని, అవసరమైతే రూ. 500 కోట్లు ఖర్చు పెట్టి అయినా సరే, మునుగోడు ప్రజలను అంగడి సరుకులా కొంటానని నరేంద్ర మోదీ అహకారం ప్రదర్శించారు. ఆ అహంకారానికి, మునుగోడు ప్రజల ఆత్మగౌరవానికి మధ్య జరుగుతున్న ఎన్నికనే మునుగోడు ఉప ఎన్నిక అని కేటీఆర్ స్పష్టం చేశారు.

నిన్న మునుగోడు నియోజకవర్గంలో విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్ రెడ్డి మాట్లాడుతూ.. ఒక వ్యక్తి ధనవంతుడైతే ఆ నియోజకవర్గం బాగుపడదు. రాజగోపాల్ రెడ్డికి కాంట్రాక్టులు కట్టబెట్టినట్లే.. నల్లగొండ జిల్లా అభివృద్ధికి రూ. 18 వేల కోట్లు ఇస్తే.. పోటీ నుంచి తప్పుకుంటామని సవాల్ విసిరారు. మా మంత్రి ఇచ్చిన స్టేట్‌మెంట్‌కు టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కట్టుబడి ఉంటాం. మాకు నియోజకవర్గం అభివృద్ధి కావాలి. ఒక్క సీటో, రెండో సీట్లతోనూ ఫరక్ పడేది లేదు. 105 సీట్లతో సభలో ప్రజల ఆశీర్వాదంతో ఉన్నామని కేటీఆర్ తెలిపారు.

### మోదీకి, బోడీకి బెదిరేది లేదు.. ఏం చేసుకుంటారో.. చేసుకోండి : కేటీఆర్

ప్రధాని నరేంద్ర మోదీతో పాటు బీజేపీ రాష్ట్ర నాయకత్వంపై టీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిప్పులు చెరిగారు. మోదీ, బోడీకి బెదిరిలేదు.. ఏం చేసుకుంటారో.. చేసుకోండి అని కేటీఆర్ తేల్చిచెప్పారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన టీఆర్ఎస్‌వీ విస్తృత స్థాయి సమావేశంలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు.

గట్టిగా మాట్లాడిన వారిపై సీబీఐ, ఈడీ, ఐటీ దాడులు చేయిస్తరు. మోదీ, బోడీ, నీ ఈడీ మా వెంట్రుక కూడా పీకలేరు. ఏం చేసుకుంటవో చేసుకోపో. చావనైనా చస్తాం.. నీకు మాత్రం లొంగిపోయే ప్రసక్తే లేదు. తప్పు చేయనోళ్లు ఎవరికీ భయపడరు. ఆరోపణలు మోదీ మీద వచ్చాయి. శ్రీలంక దేశంలో అక్కడి ప్రభుత్వ పెద్దలు, విద్యుత్ రంగ సంస్థ అధిపతి.. మోదీ మీద ఆరోపణలు చేశారు. రూ. 6 వేల కోట్ల కాంట్రాక్ట్ గౌతం అదానీకి ఇవ్వాలని ఒత్తిడి చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. నీకు నీతి, సిగ్గు, మానం ఉంటే దాని మీద వివరణ ఇవ్వండి. అది వాస్తవమా? కాదా? చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. దీనిపై ప్రజలకు సంజాయిషీ ఇవ్వాలన్నారు.

### బీఆర్ఎస్‌ను బరాబర్ పరిచయం చేస్తాం..

దేశం ఒక వైపు పేదరికంలోకి పోతోంది. నిరుద్యోగం పతాక స్థాయికి చేరింది. నిత్యావసర ధరలు ఆకాశాన్ని అంటాయి. 8 ఏండ్లలో మోదీ చేసిందేమీ లేదని కేటీఆర్ ధ్వజమెత్తారు. పేదలున్న దేశంగా భారత్ మారింది. ధనవంతులే ధనవంతులుగా మారిపోతున్నారు. ఒక అదానీ, రాజగోపాల్ రెడ్డి ధనవంతులైతే ఈ దేశ ప్రజల భాగ్య రేఖలు మారిపోతాయా? అని ప్రశ్నించారు. మన తెలంగాణ మోడల్‌ను దేశానికి చూపేందుకే భారత్ రాష్ట్ర సమితి అని పెడుతున్నాం. బరాబర్ పరిచయం చేస్తాం. గుజరాత్ మోడల్‌తో దేశాన్ని గోల్‌మాల్ చేసినప్పుడు , బ్రహ్మాండంగా పని చేస్తూ, పేదవారికి అండగా ఉన్న తెలంగాణ రాష్ట్ర సమితి, భారత్ రాష్ట్ర సమితి ఎందుకు కావొద్దు. ఇక్కడ ఎవరెవరో రాజకీయం చేయొచ్చు. కానీ తెలంగాణ వారు బయటకు వెళ్లి రాజకీయం చేయొద్దా? తెలంగాణకు చేసినట్లే.. దేశంలోని ఇతర ప్రాంతాలకు మన అభివృద్ధిని విస్తరిద్దాం. బలంగా గులాబీ జెండాను ఇతర ప్రాంతాల్లో నాటుదామని కేటీ ఆర్ పిలుపునిచ్చారు.

## ములాయం పార్థివదేహానికి నివాళులర్పించిన సీఎం కేసీఆర్



హైదరాబాద్, అక్టోబర్ 11: ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, సమాజ్‌వాదీ పార్టీ అధినేత ములాయం సింగ్ యాదవ్ పార్థివదేహానికి ముఖ్యమంత్రి కేసీఆర్ నివాళులర్పించారు. హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో ఉత్తరప్రదేశ్ చేరుకున్న సీఎం.. ఇటావా జిల్లాలో ఉన్న ములాయం స్వగ్రామం సైఫయిలో ములాయం భౌతికకాయం వద్ద అంజలి ఘటించారు. అనంతరం ఆయన తనయుడు అఖిలేశ్ యాదవ్, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించారు.

అనంతరం ములాయం అంత్యక్రియల్లో సీఎం పాల్గొననున్నారు. మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్సీ కవిత, ఎంపీ సంతోష్ కుమార్ సైతం ములాయంసింగ్ యాదవ్ భౌతిక కాయానికి నివాళులర్పించి? కుటుంబ సభ్యులను పరామర్శించారు.

అంత్యక్రియలు ముగిసిన అనంతరం ఇవాళ సాయంత్రం కేసీఆర్ ఢిల్లీకి చేరుకుంటారు. మూడు, నాలుగు రోజుల పాటు కేసీఆర్ ఢిల్లీలోనే మకాం వేయనున్నట్లు తెలుస్తోంది. టీఆర్ఎస్ పార్టీ పేరును బీఆర్ఎస్‌గా మార్చుతూ తీర్మానం చేసిన తర్వాత తొలిసారి కేసీఆర్ ఢిల్లీకి వెళ్తున్నారు. ఈ సందర్భంగా పలువురు జాతీయ నాయకులతో కేసీఆర్ సమావేశం అయ్యే అవకాశం ఉంది.

## మునుగోడులో పోటీ చేయడం లేదు.. తేల్చిచెప్పిన బూర నర్సయ్య గౌడ్

హైదరాబాద్, అక్టోబర్ 11: టీఆర్ఎస్ పార్టీ మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ మునుగోడు ఉప ఎన్నికలో పోటీ చేస్తారని సోషల్ మీడియాలో వస్తున్న వార్తలపై ఆయన స్పందించారు. తాను మునుగోడు ఉప ఎన్నికలో పోటీ చేయడం లేదని తేల్చిచెప్పారు.

ఆ వార్తల్లో నిజం లేదన్నారు. టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తాననే ప్రచారంలో నిజం లేదు.. అలాంటి వార్తలను నమ్మొద్దని విజ్ఞప్తి చేశారు. సోషల్ మీడియాలో ప్రచారాన్ని పట్టించుకోవద్దని చెప్పారు. సీఎం కేసీఆర్ ప్రకటించిన టీఆర్ఎస్ అభ్యర్థి కోసం చిత్తశుద్ధితో పని చేస్తానని స్పష్టం చేశారు. పదవులు, డబ్బుల కోసం పాకులాడే వ్యక్తిని కాదని బూర నర్సయ్య గౌడ్ తేల్చిచెప్పారు.

మునుగోడు టీఆర్ఎస్ అభ్యర్థిగా కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డిని సీఎం కేసీఆర్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇప్పటికే ఆయనకు కేసీఆర్ బీ ఫామ్ అందజేశారు. ఈ నేపథ్యంలో మునుగోడు నియోజవకర్గంలో టీఆర్ఎస్ ప్రచారం ఊపందుకుంది. రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రచారంలో పాల్గొంటూ, రాష్ట్రాభివృద్ధిని ప్రజలకు వివరిస్తున్నారు.

## మోడల్ పోలీస్ స్టేషన్లను నిర్మిస్తున్నాం -హోంమంత్రి మహమూద్ అలీ




కరీంనగర్, అక్టోబర్ 11 (నేటి నిజం ప్రతినిధి): రాష్ట్రంలో మోడల్ పోలీస్ స్టేషన్ నిర్మాణం వేగంగా జరుగుతుందని రాష్ట్ర హోంశాఖ మంత్రి మహమూద్ అలీ పేర్కొన్నారు. మంగళవారం పెద్దపెల్లి జిల్లాలోని అంతర్గాం, గోదావరిఖని ఒకటవ పోలీస్ స్టేషన్‌తో పాటు పోలీస్ అతిథి గృహాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ తెలంగాణ ఆవిర్భావ మంత్రం ముఖ్యమంత్రి కేసీఆర్ అని, మోడల్ పోలీస్ స్టేషన్ల నిర్మాణంతో పాటు పోలీసులకు అత్యాధునిక సౌకర్యాలు వాహనాలు అందుబాటు లోకి తీసుకువచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్, రాష్ట్ర డీజీపీ మహేందర్ రెడ్డి, రామగుండం సీపీ చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ సంగీత సత్యనారాయణ, ఎంపీ వెంకటేష్ నేత, ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.

## నల్లమల్ల అడవుల్లో కనిపించిన పెద్ద పులి..

నాగర్‌కర్నూల్, అక్టోబర్ 11: జిల్లా పరిధిలోని అమ్రాబాద్ నల్లమల్ల అడవుల్లో పెద్ద పులి కనిపించింది. విధి నిర్వహణలో భాగంగా జిల్లా ఫారెస్ట్ అధికారి రోహిత్ రెడ్డి.. సోమవారం రాత్రి అడవిలో పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ క్రమంలో వారికి పెద్ద పులి కనిపించింది. దీంతో ఫారెస్ట్ ఆఫీసర్ రోహిత్ రెడ్డి తన మొబైల్‌లో చిత్రీకరించి ట్విట్టర్ ఖాతాలో పోస్టు చేశారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పులుల సంరక్షణ, అటవీ జంతువుల సంరక్షణకు తీసుకుంటున్న చర్యలను నెటిజన్లు ప్రశంసించారు.

## పత్రికా విలేఖరిపై బీట్ ఆఫీసర్ చేసిన దాడిని ఖండిస్తున్నాం ప్రెస్ క్లబ్ పెద్దవంగర



మహబూబాబాద్, అక్టోబర్ 11(నేటినిజం ప్రతినిధి): జిల్లా గంగారం మండలం చింతగూడెం గ్రామంలో మనతెలంగాణ పత్రిక విలేకరి పల్లె సురేష్ పై బీట్ ఆఫీసర్ చేసిన దాడిని పెద్దవంగర ప్రెస్ క్లబ్ తరుపున అద్యక్షులు గుళ్ళపల్లి సదానందం తీవ్రంగా ఖండించారు.

తన భూమికి సంబంధించిన సర్వే గురించి సురేష్ మాట్లాడుతున్న క్రమంలో.. విచక్షణరహితంగా అతనిని బీట్ ఆఫీసర్ చాతిపై కొట్టడం, కిందపడిన వదలకుండా బూటుకాలుతో తన్నడం, గొడ్డలి తీసుకొని నరికి చంపుతానని మీదికి రావడం జరిగింది. అక్కడ ఉన్న రైతులు అడ్డుపడడంతో ప్రమాదం తప్పింది.

ఈ..చర్యను తీవ్రంగా ఖండిస్తున్నాం.. ఇంత భయంకరంగా.. విచక్షణరహితంగా దాడి చేసిన బీట్ ఆఫీసర్ పై చర్యలు తీసుకోవాలని పెద్ద వంగర మండల విలేకర్లు అందరు డిమాండ్ చేస్తున్నాం. ఈ కార్యక్రమంలో భద్రయ్య చారి ,బాలాజీ, సుధాకర్ ,తులసి వేణు ,కుమ్మరి రామ్మూర్తి , రాయరపు రాజు , యాసారపు భాస్కర్, మధు ,సుధగాని యాకన్న గౌడ్, శ్రీశైలం,శ్రీను,నవీన్ , చింతల్ ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యశ్రీతో ఉచితంగా డయాలసిస్ సేవలు : హరీశ్‌రావు



హైదరాబాద్, అక్టోబర్ 11: డయాలసిస్ పేషెంట్లకు ఆరోగ్యశ్రీలో ఉచితంగా సేవలు అందిస్తున్నట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. మంగళవారం నగరంలోని వెంకళరావునగర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కార్యాలయంలో నిర్వహించిన డయాలసిస్ పేషెంట్లకు ఆసరా పింఛన్లు అందించే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 5వేల మంది డయాలసిస్ పేషెంట్లకు పింఛన్లు అందిస్తున్నట్లు చెప్పారు.

వారికి ఇవాళ గుర్తింపు కార్డులు అందిస్తున్నట్లు పేర్కొంది. 10వేల మంది రోగులకు ఆరోగ్యశ్రీ ద్వారా డయాలసిస్ సేవలు అందిస్తున్నామని, అందులో 5వేల మందికి రూ. 2016 చొప్పున ఆసరా పింఛన్లను ప్రభుత్వం ఇస్తుందన్నారు. సీఎం కేసీఆర్ డయాలసిస్ పేషెంట్లకు ఆసరా పెన్షన్ అందించడం సంతోషకరమన్న హరీశ్‌రావు.. ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. దేశంలో డయాలసిస్ పేషెంట్లకు ఆసరా పింఛన్లు అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని స్పష్టం చేసింది.ఇది కేవలం సీఎం కేసీఆర్‌తో మాత్రమే సాధ్యమైందన్నారు. కిడ్నీ రోగుల కోసం బడ్జెట్‌లో రూ. 100 కోట్లు ప్రభుత్వం కేటాయించిందని, డయాలసిస్ రోగులకు సింగిల్ యూజ్ ఫిల్టర్ తీసుకువచ్చిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అని తెలిపారు. తెలంగాణలో 103 డయాలసిస్ సెంటర్లను ఏర్పాటు చేసుకున్నామన్నారు. అవసరమైన వారికి ప్రభుత్వమే ఆరోగ్యశ్రీ కింద రూ. 10లక్షలు ఇచ్చి ఉచితంగా కిడ్నీ మార్పిడి చేస్తుందని, అలాగే వారికి జీవితకాలం ఉచితంగా మందులు ఇవ్వడం జరుగుతోందన్నారు.గాంధీ, ఉస్మానియా, నిమ్స్ లలో ఈ సేవలు అందుతున్నాయన్నారు. రూ. 40 కోట్లతో ఆర్గాన్ ట్రాన్స్ ప్లాంటేషన్ కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. కిడ్నీ ట్రాన్స్ ప్లాంట్ ఉచితంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో జరుగుతుంది. ప్రతి 100 మందిలో 20మందికి షుగర్, బీపీ వ్యాధులు వస్తున్నాయన్న మంత్రి.. చిన్న వయసులో సైతం కనిపిస్తున్నాయన్నారు. వైద్యుల సూచనల మేరకు మందులువాడాలని సూచించారు.

నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం





(అక్టోబర్ 12 సుబ్రతోమిత్రా పుట్టినరోజు...)

-రాధశ్రీ

సెల్:9494481210



నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం




# ప్రపంచ సమస్యగా అవతరించిన ఆర్థరైటిస్

కీళ్ళ వాపులు, మస్క్యులోస్కెలిటల్ రుగ్మతలకు సంబంధించిన వ్యాధులను ఆర్థరైటిస్ అంటాం. కీళ్ళవాపు వ్యాధితో కీళ్ళనొప్పులు, కదలికలు తగ్గడం, కీళ్ళు కదలకుండా దృఢంగా మారడం వంటి పలు సమస్యలు ఉత్పన్నం అవుతాయి. అన్ని వయస్సుల జనంలో కనిపించే ఆర్థరైటిస్ రోగ తీవ్రత, వాటిలో రకాన్ని బట్టి చికిత్స పద్ధతులు నిర్ణయించబడుతాయి. సర్వసాధారణ ఆర్థరైటిస్ రోగాలలో ఆస్టియోఆర్థరైటిస్, రిమటాయిడ్ ఆర్థరైటిస్, గౌట్ (వేళ్ళ దగ్గర పుండు), లూపస్ (చర్మవృక్క వికార రోగం) ముఖ్యమైనవి. కీళ్ళవాపు వ్యాధితో శరీర కదలికల్లో మార్పు, పనులు సక్రమంగా చేయలేక పోవడం లాంటి లక్షణాలు కనిపిస్తాయి. ఆర్థరైటిస్ వ్యాధిగ్రస్థుల్లో నడక, సైక్లింగ్, ఈత లాంటి భౌతిక క్రియలు కష్టమైనప్పటికీ, వాటితోనే కొంత ఉపశమనం కూడా కలుగుతుంది. శరీర బరువు తగ్గడంతో మోకాళ్లపై భారం తగ్గిపోయి కీళ్ళ నొప్పులు కూడా తగ్గుతాయి.

### ప్రపంచ ఆర్థరైటిస్ దినం-2022 నినాదం:

రుమాటిక్ అండ్ మస్క్యులోస్కెలిటల్ వ్యాధుల (ఆర్థరైటిస్ వ్యాధుల) పట్ల ప్రజల్లో అవగాహన, జీవనశైలిలో మార్పులు, తొలి దశలోనే గుర్తించడం, కీళ్ళనొప్పులతో బాధపడే వారు తీసుకోవలసిన జాగ్రత్తలు, ఆర్థరైటిస్ రాకుండా తీసుకోవలసిన

### (12 అక్టోబర్ "ప్రపంచ ఆర్థరైటిస్ దినం" సందర్భంగా)

జాగ్రత్తలు తెలియచేయటానికి ప్రతియేటా 12 అక్టోబర్ రోజున 'ప్రపంచ కీళ్ళవాపు లేదా ఆర్థరైటిస్ దినం" జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. 1996లో అంతర్జాతీయ ఆర్థరైటిస్, రుమటిజమ్ సంస్థ నేతృత్వంలో ప్రపంచ ఆర్థరైటిస్ దినం ప్రవేశ పెట్టబడింది. ప్రపంచ ఆర్థరైటిస్ దినం-2022 నినాదంగా 'లెట్ అజ్ గెట్ ఫిజికల్' అనే అంశాన్ని తీసుకొని అవగాహన కల్పిస్తున్నారు. తొలి దశలో (12 వారాల లోపు) గుర్తించిన వారికి సులభంగా నియంత్రించబడే ఆర్థరైటిస్, ఆలస్యంగా గమనించిన వారిలో తీవ్ర వ్యాధిగా మారి శరీరక శ్రమ చేయలేకపోవడం, దినచర్యలో క్రియాశీలత క్షీణించడం లాంటి పరిణామాలకు దారితీస్తుంది. అనువంశికంగా కూడా సంక్రమించగల ఆర్థరైటిస్ వ్యాధి పొగ త్రాగడం, స్థూలకాయం, నిష్క్రియాత్మక జీవనశైలి, కీళ్ళ/కండరాలపై పని ఒత్తిడి, ప్రమాదాలు లాంటి కారణాలతో కీళ్ళ వాపు వ్యాధి తీవ్రత (ఆర్థరైటిస్) పెరుగుతుంది.

### ప్రపంచ సమస్యగా ఆర్థరైటిస్:

ప్రపంచవ్యాప్తంగా 350 మిలియన్ల ప్రజలు ఆర్థరైటిస్‌తో బాధపడుతున్నారు. దాదాపు విశ్వ జనాభాలో ఒక శాతం ప్రజలు రుమటాయిడ్ ఆర్థరైటిస్‌తో సతమతం అవుతున్నారు. వయస్సు 60 ఏళ్ళు దాటిన మహిళల్లో 18 శాతం, పురుషుల్లో 10 శాతం ప్రజలు ఆస్టియోఆర్థరైటిస్‌తో బాధ పడుతున్నారు. ఇండియాలో 15 శాతం ప్రజలకు (180 మిలియన్లు) కీళ్ళవాపు సమస్యలు ఉన్నాయి. ఆరోగ్యకర జీవనశైలి (పొగ తాగక పోవడం, మానసిక ఒత్తిడి తగ్గించడం, చక్కగా నిద్ర పోవడం, ఆల్కహాల్‌కు దూరంగా ఉండడం), ఆరోగ్యకర ఆహారపు అలవాట్లు (సమతుల పోషకాహారం, ఉప్పు మరియు చక్కెరను తగ్గించడం), వైద్యులు లేదా ఫిజియోథెరపిస్టు సూచనల మేరకు శారీరక శ్రమ (సైక్లింగ్, వాకింగ్, గార్డెనింగ్, స్విమ్మింగ్, యోగా వంటివి) పాటించడం ద్వారా ఆర్థరైటిస్ అదుపు చేయపడుతుంది. రుమటాయిడ్ ఆర్థరైటిస్ వయసుతో ప్రమేయం లేకుండా రావచ్చేమో కాని వయస్సుతో పాటు వచ్చే అవకాశం ఆస్టియోఆర్థరైటిస్‌కు ఉంటుంది. ఆస్టియోఆర్థరైటిస్ అదుపు చేయడానికి నీటిని ఎక్కువగా తాగడం(2 లీటర్ల కన్న ఎక్కువ), నూనెలు/కొవ్వులను తగ్గించడం, స్వీట్స్ మరియు సాఫ్ట్ డ్రింక్స్ తగ్గించడం, పోషకాహారం తీసుకోవడం, నిపుణుల సూచనలతో శారీరక వ్యాయామం చేయడం లాంటివి పాటించాలి.

### రుమటాయిడ్ ఆర్థరైటిస్:

రుమటాయిడ్ ఆర్థరైటిస్ అనబడే దీర్ఘకాలిక రుగ్మత కారణంగా చర్మం, కళ్ళు, ఊపిరితిత్తులు, గుండె, రక్తనాళాలతో పాటు రోగనిరోధకశక్తిని ప్రభావితం చేస్తుంది. రుమటాయిడ్ ఆర్థరైటిస్ తీవ్రతతో ఎముకల క్షయం మరియు కీళ్ళ వైకల్యంతో పాటు వాపుతో తీవ్రమైన నొప్పి వస్తుంది. వయసు, లింగం, అనువంశికత, పొగ తాగడం, పర్యావరణ కాలుష్యం, అధిక బరువు కారణాలతో రుమటాయిడ్ ఆర్థరైటిస్ రావచ్చు. ఈ వ్యాధి ఫలితంగా పొడి కళ్ళు / నోరు, అసాధారణ శరీర కూర్పు, కీళ్ళ వాపు, కీళ్ళ దృఢత్వం తగ్గడం, మూత్రపిండాలు, లాలాజల గ్రంథులు, నరాల కణజాలం, ఎముకన మజ్జ, నోడ్యూల్స్, గుండె సమస్యలు, ఊపిరితిత్తుల జబ్బులు, కార్పాల్ టన్నెల్ సిండ్రోమ్ రుగ్మతలు కలుగుతాయి. దీనిని తగ్గించడానికి వేడి లేదా చల్లని ప్యాక్స్, తగినంత విశ్రాంతి, వ్యాయామం లాంటి జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. రుమటాయిడ్ ఆర్థరైటిస్ వ్యాధిగ్రస్థులు ఒమెగా-3 ఫ్యాటీ ఆమ్లాలు, చేపలు, సోయా గింజలు, అవిసెలు, అక్రోట్లు, విటమిన్- ఏ, సి, ఈ కలిగిన ఆహారం, బెర్రీస్, చాక్లెట్స్, పాలకూర, బీన్స్, తాజా పండ్లు, అల్లం, ఫిష్ ఆయిల్, తాజా కూరగాయలు, ఫైబర్ ఫుడ్, బ్రోకోలీ, గ్రీన్ టీ, ద్రాక్ష లాంటి పోషకాహారం తీసుకోవాలి.

కీళ్ళ వాపు సమస్యలు రాకుండా ఉండేలా జీవనశైలిలో మార్పులు చేసుకుంటూ, వైద్యుల సూచన మేరకు పోషకాహారం తీసుకోవడం అలవాటు చేసుకోవాలి. ఆర్థరైటిస్ వ్యాధిగ్రస్థులు వైద్య నిపుణుల సూచనలకు అనుగుణంగా జాగ్రత్తలు తీసుకుంటూ వ్యాధిని నియంత్రించాలి. చికిత్స కన్న నివారణే మిన్న అని ముందు జగ్రత్త పడుతూ, సంతోషదాయక జీవనయానం చేద్దాం.



- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

## మునుగోడు లో కాంగ్రెస్ పార్టీ విజయం ఖాయం: పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సాగరం వెంకటస్వామి



రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 11 (నేటినిజం ప్రతినిధి): మునుగోడు ఎలక్షన్ లో కాంగ్రెస్ పార్టీ విజయం తథ్యమని వేములవాడ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సాగరం వెంకటస్వామి ఆశాభావం వ్యక్తం చేశారు. మంగళవారం వేములవాడ పట్టణంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మునుగోడు నియోజకవర్గం లో కాంగ్రెస్ పార్టీ చేసిన అభివృద్ధి తప్ప ఏ పార్టీ కూడా చేయలేదని అందుకు కాంగ్రెస్ పార్టీ పాల్వాయి స్రవంతికి పట్టం కడతారని ఆయన అన్నారు. వాళ్ల తండ్రిగారు పాల్వాయి గోవర్ధన్ గారు ఆ ప్రాంతానికి ఎనలేని సేవ చేశాడని ఆయన చేసిన సేవలు ప్రజల గుండెల్లో చెరగని ముద్రగా నిలిచిపోయిందని ఆయన అన్నారు అందుకు పాల్వాయి స్రవంతి విజయాన్ని ఎవరు ఆపలేరని ఆయన అన్నారు ఆయన వెంట నాయకులు కూరగాయల కొమురయ్య, దుర్శటి అరుణ్తేజ చారి, కనికరపు రాకేష్, నాగుల రాము గౌడ్, ఖమ్మం గణేష్, తంగేళ్ల గణేష్, దాడి మల్లేశం, గంటల ప్రకాష్, పల్లకొండ అమర్, మద్రిపల్లి రాజు, తదితరులు ఉన్నారు.

## కలెక్టర్ కి పలు సమస్యలపై వినతిపత్రం

**- వైరా మున్సిపాలిటీ సమస్యల పై కలెక్టర్ తో మాట్లాడిన రాములునాయక్, బొర్రా రాజశేఖర్**



ఖమ్మం, అక్టోబర్ 11 (నేటినిజం ప్రతినిధి): మంగళవారం ఖమ్మనీజిల్లా కలెక్టర్ వి.పి గౌతమ్ తో వైరా ఏమ్మెల్యే రాములునాయక్ మార్కుఫెడ్ రాష్ట్ర వైస్ చైర్మన్ బొర్రారాజశేఖర్ పలు సమస్యల పై వినతి పత్రం అందజేశారు.

వైరా రింగ్ రోడ్డు నుంచి రిజర్వ్యాయిర్ వరకు సెంటర్ లైటింగ్, డివైడర్ తో రోడ్ నిర్మాణం కొరకు డిఎంఎఫ్టి నిధులు మంజూరు చేయాలనీ కోరారు.

డంపింగ్ యాడ్ స్థలం కేటాయించినా చెత్త వాహనాలు వెళ్లే దానికి రహదారి నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలనీ కోరారు.

వైరా జూనియర్ కాలేజీలో కాంప్లెక్స్ కోసం అనుమతించాలని కోరారు.

వైరా మున్సిపల్ కమిషనర్ గా రెగ్యులర్ పోస్టింగ్ ఇవ్వాలని కోరారు.

వైరా ఇండోర్ స్టేడియం టెండర్ ప్రక్రియ పూర్తి అయినందున పనులు ప్రారంభించాలని కోరారు.

## దసపల్లా భూములపై సుప్రీంకోర్టు ఆదేశాలు అమలు చేశాం- విజయసాయిరెడ్డి

అమరావతి: అక్టోబర్ 11:దసపల్లా భూములపై సుప్రీంకోర్టు ఆదేశాలు అమలు చేశామని వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి అన్నారు. విశాఖపట్నంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ? ప్రభుత్వ నిర్ణయంతో 400 కుటుంబాలకు మేలు జరిగిందన్నారు. అది ప్రభుత్వ భూమి కాదన్నారు. ప్రైవేట్ భూమిని 22ఏ నుంచి తీసేస్తే తప్పేముందన్నారు. ఇందులోనూ బెనిఫిట్ పొందింది చంద్రబాబు సామాజిక వర్గం వారేనన్నారు.

విశాఖలో జనం ఎక్కువగా వేరే సామాజికవర్గం వారు ఉంటే.. ఆస్తులన్నీ చంద్రబాబు సామాజిక వర్గం వారికే ఉన్నాయన్నారు. తనకు విశాఖ సీతమ్మ ధారలో మాత్రమే ఒక్క ప్లాట్ ఉందన్నారు. భూముల కొనుగోళ్లు, అమ్మకాల్లో తన పాత్ర ఎక్కడా లేదన్నారు. తన ఆస్తులపై సీబీఐ విచారణకు సిద్ధమని, మీరు సిద్ధమా అన్నారు. తాను ఇంత వరకు ఏ వ్యాపారం చేయలేదన్నారు.

## వెమ్ టెక్నాలజీస్ (NIMZ) కు కేటాయించిన భూమి సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలి-జిల్లా కలెక్టర్ శరత్



సంగారెడ్డి, అక్టోబర్ 11 (నేటి నిజం ప్రతినిధి) వెమ్ టెక్నాలజీస్ (NIMZ)కు కేటాయించిన భూమికి సంబంధించి సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని,అందుకు ఆయా అధికారులు త్వరిత గతిన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ శరత్ సంబంధిత అధికారులకు ఆదేశించారు.

సోమవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో ఎస్పీ రమణ కుమార్, అదనపు కలెక్టర్లు రాజర్షి షా, వీరారెడ్డితో కలిసి

టి ఎస్ ఐ ఐ సి, పరిశ్రమలు, విద్యుత్, మిషన్ భగీరథ, ల్యాండ్ సర్వే అధికారులు, జహీరాబాద్ ఆర్డిఓ, డి.ఎస్.పి. లతో వెమ్ టెక్నాలజీస్ కు కేటాయించిన భూమి, మిలిన భూసేకరణ, రీ రూటింగ్ ఫైనలైజేషన్, ఎలక్ట్రిక్ లైన్స్ ఎస్టిమేషన్, నైపుణ్యఅభివృద్ధి శిక్షణ కేంద్రం ప్రారంభం, తదితర అంశాలపై సమీక్షించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ (NIMZ) వెమ్ టెక్నాలజీస్ సంస్థకు కేటాయించిన భూమికి సంబంధించి ఆయా సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. కొత్త సబ్ స్టేషన్ ఏర్పాటుకు, కావలసిన ల్యాండ్, విద్యుత్ లైన్స్, విద్యుత్ సబ్ స్టేషన్ రీ లొకేషన్, తదితరాలకు వెంటనే ఎస్టిమేషన్ ఇవ్వాలని విద్యుత్ శాఖ ఎస్. ఈ. మాధవరెడ్డికి ఆదేశించారు.

మిగిలిన భూసేకరణకను వేగవంతం చేయాలన్నారు. అదే విధంగా బదిపూర్, చీలెపల్లి భూమికి సంబంధించి అవార్డ్స్ పాస్ చేయాలని ఆర్డీవో కు సూచించారు.

వెమ్ టెక్నాలజీస్ లో భూమి కోల్పోయిన కుటుంబాల నిరుద్యోగ యువతకు నైపుణ్య అభివృద్ధి శిక్షణకై వెమ్ టెక్నాలజీస్ (నితిఎళ్) నైపుణ్య శిక్షణ కేంద్రం లో శిక్షణ నిచ్చి ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలని, ఆయా కుటుంబాలలోని నిరుద్యోగ యువతకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమీక్షలో అదనపు కలెక్టర్ రాజర్షి షా, వీరారెడ్డి, విద్యుత్, మిషన్ భగీరథ, పంచాయతీరాజ్, పరిశ్రమ లు, పంచాయితీ శాఖల అధికారులు, జహీరాబాద్ డిఎస్పి, రెవిన్యూ డివిజ నల్ అధికారి, తదితరులు పాల్గొన్నారు.

## గ్రూప్ 1 పరీక్షలు ప్రశాంతంగా సజావుగా నిర్వహించాలి..!

**-పరీక్షా కేంద్రల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలి.**

**- సంబంధిత అధికారులకు ఆదేశించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్**



సంగారెడ్డి, అక్టోబర్ 11(నేటి నిజం ప్రతినిధి) ఈ నెల 16న నిర్వహించనున్న గ్రూప్ 1 పరీక్షలు జిల్లాలో సజావుగా ప్రశాంతంగా జరిగేలా అందరూ సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ సంబంధిత అధికారులకు ఆదేశించారు.

సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయన జిల్లా ఎస్పీ రమణ కుమార్ తో కలిసి గ్రూప్ 1 పరీక్షల నిర్వహణ, ఏర్పట్లపై సంబంధిత అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్ లు,లైజన్ అధికారులు,అసిస్టెంట్ లైజన్ ఆఫీసర్స్ లతో సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అక్టోబర్ 16న నిర్వహించనున్న గ్రూప్ 1 పరీక్షలు ఎలాంటి పొరపాట్లు జరగకుండా జిల్లాలో సజావుగా జరిగేలా పకడ్బందీ చర్యలు చేపట్టాలని సూచించారు.

గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు జిల్లాలో 8,654 మంది అభ్యర్థులు హాజరు కానున్నట్లు తెలిపారు. 26 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జిల్లాలో సంగారెడ్డి, సదాశివపేట, వతాన్ చెరు, రామచంద్రా పురం లలో కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఎంపిక చేసిన పరీక్షా కేంద్రాలలో 24 మంది అభ్యర్థులు, 48 మంది అభ్యర్థులు పరీక్ష వ్రాయుటకు వీలుగా రూములను గుర్తించి ఫర్నీచర్, లైట్స్, ఫ్యాన్స్ ,మంచినీటి సౌకర్యం వంటి వి ఏర్పాటు చేయాలని, ప్రతి గదికి సి.సి. కెమెరాలు అమర్చి మానిటరింగ్ చేయాలని అన్నారు.

ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను మరొ సారి క్షుణ్ణంగా పరిశీలించి ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా చూసుకోవాలని చీఫ్ సూపరింటెండెంట్ లకు ఆదేశించారు.

పరీక్ష ఉదయం 10.30 నుండీ మధ్యాహ్నం 1:00 గంట వరకు ఉంటుందన్నారు.

పరీక్ష నిర్వహించు రోజున పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించాలని, జిరాక్స్ కేంద్రాలను,ఇంటర్నెట్ కేంద్రాలను మూసివేయించాలని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులకు సూచించారు.

ప్రతి కేంద్రం వద్ద ప్రాథమిక చికిత్స కు అవసరమైన ఏర్పాట్లు చేయాలని, నిరంతరాయంగా విద్యుత్ ఉండేలా చూడాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు సమయానికి చేరుకునేలా బస్సులు నడపాలని ఆర్ టి సి వారికి సూచించారు.

పరీక్షా కేంద్రంలోకి ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలు, సెల్ పొన్లు అనుమతించడం జరగదని కలెక్టర్ స్పష్టం చేశారు. వికలాంగ అభ్యర్థుల కోసం పరీక్షా కేంద్రాలలో ర్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు.

పరీక్షల నిర్వహణ అత్యంత జాగ్రత్తగా,భాధ్యతగా చేయాలని, అజాగ్రత్త,అలక్ష్యం పనికిరా దని,చీఫ్ సూపరింటెండెంట్ లు అందరి సమన్వయంతో పరీక్షల నిర్వహణ విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. పరీక్ష పూర్తయ్యే వరకు ఎవరిని బయటకు పంపరాదని తెలిపారు.

ఈ సమావేశంలో జిల్లా ఎస్పి రమణ కుమార్, అడిషన్ కలెక్టర్లు రాజర్షి షా, వీరారెడ్డి,చీఫ్ సూపరింటెండెంట్ లు , లైజన్ అధికారులు,అసిస్టెంట్ లైజన్ ఆఫీసర్స్, డిఆర్ఓ రాధిక రమణి, డి. ఈ ఓ,రెవెన్యూ డివిజన్ అధికారి,తహేసిల్ దార్లు,తదితరులు పాల్గొన్నారు.

## మార్కెటింగ్ ఈవెంట్లలో హస్తకళాకారులు పాల్గొనేందుకు వీలుగా ఆన్‌లైన్ పోర్టల్‌ను ప్రారంభించిన కేంద్రం

న్యూఢిల్లీ, అక్టోబర్ 11: ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా మార్కెటింగ్ ఈవెంట్లలో (కార్యక్రమాలలో ) పాల్గొనేందుకు హస్తకళాకారుల నుంచి దరఖాస్తులను ఆహ్వానించే ప్రక్రియకు డెవలప్‌మెంట్ కమిషనర్ (హ్యాండీక్రాఫ్ట్స్) కార్యాలయం శ్రీకారం చుట్టింది. దీనితో హస్తకళాకారులకు పూర్తిగా డిజిటీకరించిన మార్కెటింగ్ వేదికను ఇది అందచేస్తుంది.

వారి ఉత్పత్తులను విక్రయించేందుకు మద్దతునిచ్చే లక్ష్యంతో ప్రతిసంవత్సరం దేశంలోని భిన్న ప్రాంతాలలో సుమారు 200 మార్కెటింగ్ కార్యక్రమాలను కార్యాలయం నిర్వహిస్తున్నది. దరఖాస్తుల ఎంపిక నుంచి అంతిమంగా స్టాల్ కేటాయింపు వరకూ ఎటువంటి మానవ చొరవలు లేకుండా పూర్తిగా కంప్యూటీకరించిన ఆన్‌లైన్ ప్రక్రియ ప్రారంభమం కానుంది. ఈ ఆన్‌లైన్ ప్రక్రియ హస్తకళాకారులందరికీ సమానమైన, ఉచితమైన, పారదర్శకమైన అవకాశాన్ని కల్పిస్తుంది.

హస్తకళాకారులకు దీనిపై అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో సంబంధిత సిబ్బందికి దరఖాస్తులు సమర్పించడంపై విస్తృతమైన మార్గదర్శకాలను అందించడం జరిగింది (ఇదే అధికారిక వెబ్‌సైట్‌లో కూడా అందుబాటులో ఉంటుంది).

మార్కెటింగ్ కార్యకలాపాల కోసం అర్హులైన చేతివృత్తి పనివారు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించేందుకు డెవలప్‌మెంట్ కమిషనర్ ( హ్యాండీక్రాఫ్ట్స్) కార్యాలయం ఇండియన్ హ్యాండీక్రాఫ్ట్ పోర్టల్ (http://indian.handicrafts.gov.in)ను ప్రారంభించింది. హస్తకళాకారులు తమకు కేటాయించిన పెహెచాన్ కార్డు (గుర్తింపు) నెంబరుతో లాగిన్ అయ్యి, నమోదు చేసుకున్న మొబైల్ నెంబరుకు పంపిన ఒటిపి ద్వారా ధ్రువీకృతం అవుతారు. దిల్లీ హాట్ సహా మార్కెటింగ్ కార్యక్రమాలకు దరఖాస్తులను అందుకుని, ఎంపిక చేసే ప్రక్రియలు పోర్టల్ ద్వారా మాత్రమే జరుగుతాయి. దేశీయ మార్కెటింగ్ కార్యక్రమాలలో పాల్గొనేందుకు భౌతికంగా దరఖాస్తులను ఆహ్వానించే పద్ధతిని ఇకపై కొనసాగించరు.

## మునుగోడులో టీఆర్ఎస్ తిరుగులేని శక్తిగా నిలవబోతోంది : మంత్రి సత్యవతి రాథోడ్

వరంగల్,అక్టోబర్ 11:మునుగోడు ఉప ఎన్నికలో టీఆర్ఎస్ భారీ మెజార్టీతో విజయం సాధించడం ఖాయమని మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. మునుగోడులో తన స్వంత ప్రయోజనం కోసమే రాజగోపాల్ రెడ్డి రాజీనామా చేశారన్నారు. మునుగోడుకు రాజగోపాల్ రెడ్డి చేసిందేమీ లేదని, టీఆర్ఎస్ తోనే మునుగోడు అభివృద్ధి సాధ్యమన్నారు. రాజగోపాల్ ను ఓడగొట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. రాజగోపాల్ రెడ్డి రూ.వేల కోట్ల కాంట్రాక్టుల కోసమే కాంగ్రెస్ ను వీడి బీజేపీలోకి వెళ్లాడన్నారు. బీజేపీ పేదలను పట్టించుకోవడం లేదని అందుకే పోరాటాల్లో ముందున్న కమ్యూనిస్టు పార్టీల నేతలు తమకు మద్దతుగా ఉన్నారని తెలిపారు. సీఎం కేసీఆర్ రాజకీయ అనుభవం అంతలేని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని మంత్రి మండిపడ్డారు. టీఆర్ఎస్ తిరుగులేని శక్తిగా మునుగోడులో నిల్వబోతోందని మంత్రి సత్యవతి రాథోడ్ ధీమా వ్యక్తం చేశారు.

## రైతు సమస్యల్ని పరిష్కరించాలి- మాజీ ఎంపీపీ పెంటయ్య



రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 11 (నేటినిజం ప్రతినిధి): రైతు సమస్యలను పరిష్కరించాలని చందుర్తి మాజీ ఎంపీపీ. రైతు సంఘం మండల శాఖ అధ్యక్షులు చిలుక పెంటయ్య అన్నారు. రైతు సమస్యల పరిష్కారం కోసం భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో మంగళవారం చందుర్తి తాసిల్దార్ కార్యాలయంలో వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా చిలక పెంటయ్య మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం వెంటనే రుణమాఫీని అమలు చేయాలన్నారు. గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని. ధరణి సమస్యలు పరిష్కరించాలని. దాన్యం కొనుగోళ్ల ఇబ్బందులను పరిష్కరించాలని వినతి పత్రం లో పేర్కొన్నారు . అధిక వర్షపాతం వల్ల పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. అడవి వన్యప్రాణుల నుంచి పంటలకు రక్షణ కల్పించాలని. సిరిసిల్ల జిల్లాలో విద్యుత్ సెస్ సంస్థను రద్దు చేసి ఎన్ పిడిఎల్ లో కలపాలని వినతి పత్రం అందజేశారు, ఈ కార్యక్రమంలో రైతులు రాజేశం. మహేష్. కొండయ్య. సాయి. చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు,

## గ్రీన్ భద్రాద్రి పర్యావరణ పరిరక్షణే ధ్యేయం

**- ముఖ్య అతిదిగా కోటి విష్ణువర్ధన్**

భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 11 (నేటినిజం ప్రతినిధి) :మంగళవారం గ్రీన్ భద్రాద్రి వారు సితారామనగర్ కాలనీలో చేపట్టిన మొక్కలు నాటే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కోటి విష్ణువర్ధన్, సితారామచంద్రస్వామి వారి ఆలయ ఆచార్యులు మాట్లాడుతూ మొక్కలు పెంచటం కూడా రాములవారికి సేవ చేసినట్లేనని, రాములవారికి మొక్కలు అంటే అమిత ప్రేమ ఉండబట్టే పర్ణశాలలో ఐదు వృక్షాల మధ్యలో పర్ణశాల నిర్మించుకుని చాలా సంతోషంగా ఉండగలిగారని, అదే విధంగా ఆక్సిజన్ ఇచ్చే మొక్కలు పెంచటం ద్వారా మానవాళికి సేవ చేసినవారమౌతామని వివరించారు.

ఈ సందర్భంగా గ్రీన్ భద్రాద్రి ఫౌండర్ బొలిశెట్టి రంగారావు మాట్లాడుతూ గ్రీన్ భద్రాద్రి పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా గత 11 సంవత్సరాల నుండి వేలాది మొక్కలు నాటడమే కాక వాటిని సంరక్షిస్తూ, భద్రాచల ప్రజల సహకారంతో నేడు వెలకట్టలేని వృక్ష సంపదను అందించటం జరిగిందని తెలియజేసారు.

ఈ సందర్భంగా గ్రీన్ భద్రాద్రి ట్రస్ట్ చైర్మన్ ఏగి సూర్యనారాయణ మాట్లాడుతూ ఈ సంవత్సరం గ్రీన్ భద్రాద్రి కొత్తగా కుండీలలో మొక్కలు పెపంకం ద్వారా మొక్కలు నాటే అవకాశం లేని ప్రదేశం లో కూడా మొక్కలు నాటటం ద్వారా భద్రాచలం మరింత పచ్చదనాన్ని సంతరించుకోబోతుందని, అదే విధంగా మిద్దె తోటల పెపంకం కూడా చేపట్టబోతున్నామని ఆసక్తి ఉన్న వారు మమల్ని సంప్రదిస్తే మిద్దెతోటల పెంపకం పై అవగాహన కల్పించటమే కాక మన మిద్దె పై పెంచే ఆకుకూరలు, కూరగాయలు, విత్తనాలు, ఉచితంగా ఇస్తామని, దీని వలన మనం పండిచిన ఆకుకూరలు, కూరగాయలు మనమే ఆరోగ్య వంతంగా తినవచ్చు అని వివరించారు.

ఈకార్యక్రమంలో గ్రీన్ భద్రాద్రి అధ్యక్షులు కామిశెట్టి కృష్ణార్జునరావు, గౌరవాధ్యక్షులు గోళ్ళ భూపతిరావు, గాదె మాధవరెడ్డి, బెల్లంకొండ రాంబాబు, పరిమి సోమశేఖర్, తంగేటి కృష్ణ, ఉప్పాడ రాంప్రసాద్ రెడ్డి, సురేష్ కొల్లు, వెంకటరెడ్డి, సుబ్రహ్మణ్యం, పిఆర్ఓ కడాలి నాగరాజు, పూసం రవికుమారి, కల్వకుంట్ల కనకదుర్గ, తదితరులు పాల్గొన్నారు.



## పేదల హృదయాల్లో సీఎం జగన్‌కు చెరగని స్థానం- ఎమ్మెల్యే కరుణాకర్ రెడ్డి



తిరుమల, అక్టోబర్ 11: పేదల హృదయాల్లో సీఎం జగన్ చెరగని స్థానం సంపాదించుకున్నారని ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలు అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతిపక్ష పార్టీలో కొత్త నాటకాలు చేస్తున్నారని ఎమ్మెల్యే భూమన్ కరుణాకర్ రెడ్డి అన్నారు. మంగళవారం 48వ డివిజన్ లో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ఆప్యాయంగా చిరునవ్వుతో పలకరిస్తూ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ సమస్య, వీధిలైట్ల సమస్య, ఇళ్ల స్థలాలు ఇలా సమస్యలు చెప్పడంతో సంబంధిత అధికారులను వెంటనే పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ? పేద బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి పాటు పడుతోనీదన్నారు. ఆరోగ్యం, విద్య, వైద్యం, మహిళా సంక్షేమంతో పాటు నిరుద్యోగ సమస్య పరిష్కారానికి లక్షలాది మందికి ఉద్యోగాలు కల్పించాలని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు ప్రైవేటు రంగంలో మరికొన్ని లక్షలాది మందికి ఉద్యోగం కల్పించిన ఘనత సీఎం జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో నగర్ డాక్టర్ శిరీష, కార్పొరేటర్ అన్నా సంధ్య, కార్పొరేటర్ రామస్వామి వెంకటేశ్వర్లు, డీఈ విజయ్ కుమార్ రెడ్డి, వైఎస్ఆర్ సీపీ నాయకులు మురళి, రఫీ, సురేందర్ రెడ్డి, రమణ, పాల్గొన్నారు.

## 15 నుంచి జనసేన అధినేత పవన్ కళ్యాణ్ విశాఖ పర్యటన..

అమరావతి: అక్టోబర్ 11: జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఈ నెల 15వ తేదీ నుంచి మూడు రోజులపాటు- ఉత్తరాంధ్ర జిల్లాల పార్టీ కార్యక్రమాలలో పాల్గొంటారు. ఈ పర్యటనలో ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన నాయకులతో, పార్టీ వాలంటీ-ర్లతో సమావేశమవుతున్నారు. 16వ తేదీన విశాఖపట్నంలో ఉత్తరాంధ్ర జిల్లాలకు సంబంధించిన జనవాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.

ఆయా జిల్లాల నుంచి ప్రజా సమస్యలపై వచ్చే వినతులను పవన్ కళ్యాణ్ స్వీకరిస్తారు. 15, 16, 17 తేదీల్లో ఉమ్మడి విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నాయకులతో సమావేశమవుతారు. ఈ సమావేశాల్లో పార్టీ నాయకులకు, శ్రేణులకు దిశానిర్దేశం చేస్తారు.

## సోనియా గాంధీ ఆదేశాలతోనే పార్టీ అధ్యక్ష ఎన్నికల బరిలో నిలిచా : మల్లికార్జున్ ఖర్గే



న్యూఢిల్లీ, అక్టోబర్ 11: కాంగ్రెస్ పార్టీని ముందుండి నడిపించాలని పార్టీ తాత్కాలిక అధ్యక్షురాలు సోనియా గాంధీ తనను కోరారని పార్టీ అధ్యక్ష ఎన్నికల బరిలో నిలిచిన సీనియర్ నేత మల్లికార్జున్ ఖర్గే పేర్కొన్నారు. గాంధీ కుటుంబం నుంచి ఏ ఒక్కరూ పార్టీ అధ్యక్ష పదవిని చేపట్టేందుకు ఆసక్తి కనబరచకపోవడంతో అధ్యక్ష ఎన్నికల రేసులో నిలిచేందుకు అంగీకరించానని ఆయన వెల్లడించారు.

పార్టీ అధ్యక్ష ఎన్నికల్లో ఖర్గే మరో సీనియర్ నేత, కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్‌తో పోటీ పడుతున్నారు. సోనియా గాంధీ తనను తన నివాసానికి పిలిపించి పార్టీ అధ్యక్ష పగ్గాలను చేపట్టాలని కోరారని, అయితే తాను మూడు పేర్లు ఇస్తానని ఆమెకు చెప్పగా నిరాకరించారని, తననే పార్టీకి నాయకత్వం వహించాలని కోరారని ఖర్గే చెప్పారు.

తనకు సమిష్టి నాయకత్వం, సంప్రదింపుల ప్రక్రియ పట్ల విశ్వాసం ఉందని, పార్టీ సభ్యులందరితో కలిసి కాంగ్రెస్‌ను సమున్నత శిఖరాలకు తీసుకువెళతానని స్పష్టం చేశారు. అసోంలో ఈశాన్య రాష్ట్రాల పార్టీ నేతలతో ఖర్గే సమావేశమై అధ్యక్ష ఎన్నికల్లో వారి మద్దతును కోరారు. అక్టోబర్ 17న కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికలు జరగనుండగా 19న ఫలితాలు వెల్లడిస్తారు.

## నేటి నుండి 16వ తేదీ వరకు జరిగే ఐఎంఎఫ్ - ప్రపంచ బ్యాంక్ వార్షిక సమావేశాలు

న్యూఢిల్లీ, అక్టోబర్ 11: కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల మంత్రి శ్రీమతి. నిర్మలా సీతారామన్ అక్టోబరు 11 నుండి అధికారిక పర్యటన కోసం అమెరికా వెళ్తున్నారు. శ్రీమతి సీతారామన్ ఇంటర్నేషనల్ మానిటరీ ఫండ్ (ఐఎంఎఫ్), ప్రపంచ బ్యాంక్, జి20 ఆర్థిక మంత్రులు, సెంట్రల్ బ్యాంక్ గవర్నర్ (ఎఫ్ఎంసిజి) వార్షిక సమావేశాలకు హాజరుకానున్నారు.

జపాన్, దక్షిణ కొరియా, సౌదీ అరేబియా, ఆస్ట్రేలియా, భూటాన్, న్యూజిలాండ్, ఈజిప్ట్, జర్మనీ, మారిషస్, యుఎఇ, ఇరాన్, నెదర్లాండ్స్‌తో సహా పలు దేశాలతో ఆర్థిక మంత్రి ద్వైపాక్షిక సమావేశాలలో పాల్గొంటారు. ఆర్థిక మంత్రి ఓఈసిడి, యూరోపియన్ కమిషన్, యుఎన్డిపి నాయకులు, అధిపతులతో కూడా విడివిడిగా సమావేశాలు నిర్వహిస్తారు.

ఆర్థిక మంత్రి సంయుక్త ట్రెజరీ సెక్రటరీ శ్రీమతి జానెట్ యెల్లెన్, ప్రపంచ బ్యాంక్ ప్రెసిడెంట్ డేవిడ్ మాల్పాస్‌లను విడివిడిగా కలుసుకుని పరస్పర ప్రయోజనాలకు సంబంధించిన అంశాలపై చర్చిస్తారు.

వాషింగ్టన్ డీసీలో ఉన్న లాభాపేక్షలేని ప్రముఖ పబ్లిక్ పాలసీ సంస్థ బ్రూకింగ్స్ ఇన్‌స్టిట్యూషన్‌లో "భారత ఆర్థిక అవకాశాలు, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో పాత్ర"పై ఫైర్ సైడ్ చాట్‌లో కూడా కేంద్ర ఆర్థిక మంత్రి పాల్గొంటారు. శ్రీమతి సీతారామన్ ఈ సందర్శనలో స్కూల్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ ఇంటర్నేషనల్ స్టడీస్, జాన్ హాప్‌కిన్స్ యూనివర్శిటీలో 'టెక్నాలజీ, ఫైనాన్స్, గవర్నెన్స్' ఇంటర్‌లింకేజ్‌ల ద్వారా భారతదేశపు ప్రత్యేకమైన డిజిటల్ పబ్లిక్ గూడ్స్ ఆలోచన, ప్రభావాలపై తన ఆలోచనలను పంచుకుంటారు. పర్యటన తరువాతి భాగంలో, కేంద్ర ఆర్థిక మంత్రి యుఎస్ఐబిసి, యుఎస్ఐఎస్‌పిఎఫ్‌లతో 'భారత్-యుఎస్ కారిడార్‌లో పెట్టుబడులు, ఆవిష్కరణలను బలోపేతం చేయడం' "భారతదేశం డిజిటల్ విప్లవంలో పెట్టుబడులు పెట్టడం" అనే అంశాలపై రౌండ్‌టేబుల్ సమావేశాలకు హాజరవుతారు. ప్రముఖ వ్యాపారవేత్తలు, పెట్టుబడిదారులతో ఈ సమావేశాలు జరుగుతాయి.

# ఐసీటీ, డిజిటల్ సొల్యూషన్స్ కోసం రైల్‌టెల్‌తో అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్న ఎన్ఎండీసీ



న్యూఢిల్లీ, అక్టోబర్ 11: మైనింగ్ దిగ్గజ సంస్థ ఎన్ఎండీసీ తన కార్పొరేట్ కార్యాలయాలు, మైనింగ్ కేంద్రాలలో ఐసీటీ, డిజిటల్ సొల్యూషన్స్ కోసం రైల్‌టెల్‌తో అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుంది. సోమవారం హైదరాబాద్ లోని ఎన్ఎండీసీ ప్రధాన కార్యాలయంలో జరిగిన ఒక కార్యక్రమంలో రెండు సంస్థలు ఒప్పందంపై సంతకాలు చేశాయి. ఎన్ఎండిసి సిఎండి శ్రీ సుమిత్ దేబ్ సమక్షంలో ఎన్ఎండిసి జిఎం (సి అండ్ ఐటి) శ్రీ హెచ్ సుందరం ప్రభు మరియు రైల్‌టెల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీ మనోహర్ రాజా ఎంఒయు పై సంతకాలు చేశారు. రెండు సంస్థల మధ్య కుదిరిన ఒప్పందం వనరుల సక్రమ వినియో గం, ఖనిజ సంపదకు జవాబుదారీతనాన్ని పెంపొందించి, మైనింగ్ రంగంలో డిజిటల్ పరివర్తనకు మార్గం సుగమం చేస్తుందని ఎన్ఎండిసి సిఎండి శ్రీ సుమిత్ దేబ్ అన్నారు. భారతదేశపు ప్రముఖ మైనింగ్ సంస్థగా గుర్తింపు పొందిన ఎన్ఎండీసీ ఆటోమేషన్ మరియు డిజిటలైజేషన్‌కు తొలుత నుంచి ప్రాధాన్యత ఇస్తున్నదని అన్నారు. . రైల్‌టెల్‌తో కుదిరిన అవగాహన వల్ల ఈ కార్యక్రమాలు మరింత వేగంగా అమలు జరుగుతాయని శ్రీ సుమిత్ దేబ్ అన్నారు.

సమర్థత మరియు పారదర్శకతను పెంపొందించే కన్సల్టెన్సీ, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ మరియు ఎగ్జిక్యూషన్ సేవలను రైల్‌టెల్ అందిస్తుందని ఎన్ఎండిసి డైరెక్టర్ (ఫైనాన్స్) శ్రీ అమితవ ముఖర్జీ అందజేస్తుందని తెలిపారు. ఎన్ఎండిసిని ప్రముఖ సంస్థల సరసన నిలబెట్టేందుకు ఈ ఒప్పందం దోహద పడుతుందని అన్నారు.

ఎన్ఎండీసీ కార్యకలాపాలు సాగిస్తున్న 11 కేంద్రాల్లో ఎంపిఎల్ఎస్, వీపీఎన్ , 7 కేంద్రాల్లో ఇంటర్నెట్ లీజ్డ్ లైన్‌లు (ఐఎల్ఎల్) హై-డెఫినిషన్ వీడియో కాన్ఫరెన్సింగ్ సొల్యూషన్‌లను గత 7 సంవత్సరాల నుంచి నేషనల్ రైల్వే టెలికామ్ సేవలను అందిస్తోంది. ఒప్పందాన్ని కొనసాగించేందుకు వీలుగా రైల్‌టెల్‌తో ఎన్ఎండీసీ కొత్తగా అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుంది.

## బాలికలకు సాంప్రదాయేతర జీవనోపాధి రంగంలో నైపుణ్యం కల్పించేందుకు "బెటియన్ బనే కుశాల్" జాతీయ సదస్సు నిర్వహించనున్న మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ

న్యూఢిల్లీ, అక్టోబర్ 11: అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా రేపు 2022 అక్టోబర్ 11న బాలికలకు సాంప్రదాయేతర జీవనోపాధి రంగంలో నైపుణ్యం కల్పించేందుకు మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ "బెటియన్ బనే కుశాల్" జాతీయ సదస్సును నిర్వహించనున్నది బాలికలకు వివిధ రంగాలలో నైపుణ్యం కల్పించి వారు శాస్త్ర, సాంకేతిక, ఇంజనీరింగ్, మ్యాథమెటిక్స్ (ఎస్ఇఓ) వంటి విభిన్న వృత్తులలో ప్రవేశించేలా చూసి సమానత్వం, సాధికారత సాధించేందుకు వివిధ మంత్రిత్వ శాఖలు, విభాగాల మధ్య సమన్వయంతో పథకాలు అమలు చేసేందుకు కార్యాచరణ పథకాన్ని రూపొందించాలన్న లక్ష్యంతో సదస్సు నిర్వహిస్తున్నారు. ఈ రంగాల్లో బాలికలకు ఇంతవరకు తగిన గుర్తింపు, ప్రాధాన్యత లభించలేదు. శాస్త్ర, సాంకేతిక, ఇంజనీరింగ్, మ్యాథమెటిక్స్ రంగాల్లో ప్రవేశించేందుకు బాలికలకు అవసరమైన శిక్షణ ఇచ్చి వారికి అవసరమైన నైపుణ్యం కల్పించేందుకు సదస్సులో భాగంగా నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపకత మరియు మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖలు అవగాహన ఒప్పందంపై సంతకం చేస్తాయి. పథకం అమలుకు సంబంధించి రాష్ట్రాలు/ జిల్లాలకు రూపొందించిన మార్గదర్శకాలను సదస్సులో విడుదల చేయడం జరుగుతుంది. మిషన్ శక్తి పథకం అమలులో చేసిన మార్పులకు అనుగుణంగా నూతన మార్గదర్శకాలు రూపొందాయి.

దేశ ప్రజల కోసం "బెటియన్ బనే కుశాల్" జాతీయ సదస్సు ప్రత్యక్ష ప్రసారం (www.youtube.com/c/MinistryofWomenChildDevelopment GovtofIndia)జరుగుతుంది. సదస్సులో నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపకత మరియు మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ , మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ, క్రీడల మంత్రిత్వ శాఖ కు చెందిన ప్రతినిధుల తో సహా నేషనల్ కౌన్సిల్ ఫర్ ది ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ వంటి చట్టబద్ధమైన సంస్థల ప్రతినిధులు,దేశం వివిధ ప్రాంతాలకు చెందిన బాలికలు మరియు యువతులు పాల్గొంటారు.

సదస్సు ముఖ్య అంశాలు:

-సాంప్రదాయేతర జీవనోపాధి రంగంలో లో దేశంలో తమదైన ముద్ర వేసిన కౌమార బాలికల బృందం సభ్యులతో కేంద్ర మహిళా మరియు శిశు అభివృద్ధి శాఖ మంత్రి శ్రీమతి స్మృతి జుబిన్ ఇరానీ మాట్లాడతారు.

-పథకం అమలుకు సంబంధించి రూపొందిన కార్యాచరణ మార్గదర్శకాలు సదస్సులో విడుదల అవుతాయి. వివిధ శాఖలు, విభాగాల మధ్య సమన్వయం సాధించేందుకు మార్గదర్శకాలు రూపొందాయి.

-జీవితం మరియు ఉపాధి నైపుణ్యాలు, వ్యవస్థాపక నైపుణ్యాలు, డిజిటల్ అక్షరాస్యత మరియు ఆర్థిక అక్షరాస్యత నైపుణ్యాలపై దృష్టి సారించే 21వ శతాబ్దపు నైపుణ్యాలపై నైపుణ్యాభివృద్ధి మంత్రిత్వ శాఖ, మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ లక్ష్యాలను సదస్సులో ప్రకటిస్తారు. ఓసీఆఇ మరియు ఓనీఓంతో కమిట్‌మెంట్‌ల ప్రకటన.

-ఎంపిక చేసిన జిల్లాల్లో నైపుణ్యాభివృద్ధి కోసం అమలు జరుగుతున్న ఉత్తమ విధానాలను సదస్సులో చర్చిస్తారు.

-సాంప్రదాయేతర జీవనోపాధి రంగంలో బాలికలు, మహిళలకు సముచిత స్థానం కల్పించే అంశంపై పరిశ్రమ, స్వచ్ఛంద సంస్థలు, ప్రజా సంస్థలు నిర్వహించిన అధ్యయనాల ఫలితాలను సదస్సులో చర్చిస్తారు.

# బీటీ రోడ్లన్నీ తళతళ లాడాలి : మంత్రి గంగుల



కరీంనగర్, అక్టోబర్ 11 (నేటినిజం ప్రతినిధి): కరీంనగర్ పట్టణంలో వర్షానికి ధ్వంసమైన బీటీ రోడ్డు నిర్మాణ పనులను 2.30 లక్షలతో పునరుద్ధరిస్తున్నట్లు బీసీ సంక్షేమ పౌరసరఫరాల శాఖ మంత్రివర్యులు గంగుల కమలాకర్ తెలిపారు. మంగళవారం కమాన్ చౌరస్తాలో నగర మేయర్ యాదగిరి సునీల్ రావుతో కలిసి మంత్రి గంగుల కమలాకర్ వర్షాలకు ధ్వంసమైన బీటీ రోడ్డు మరమ్మత్తు పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కరీంనగర్ ప్రజలకు మౌళిక సదుపాయాలు కల్పించి పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడమే తమ ధ్యేయం అన్నారు. గతంలో ఎన్నడు లేని విధంగా నగరంలో ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రహదారులు నిర్మిస్తున్నామని? భారీ వర్షాలతో కొన్ని చోట్ల రహదారులు గుంతలు, కొన్ని చోట్ల ధ్వంసం కావడంతో ఇట్టి విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో భక్తులకు నిధులు కేటాయించడం జరిగిందని వెల్లడించారు. 2కోట్ల 30 లక్షలతో నగరంలో 14.5 కిలో మీటర్ల ప్రధాన రహదారులలో ధ్వంసమైన రోడ్లన్నీ మరమత్తులు పూర్తి చేస్తామని వెల్లడించారు.. మరమ్మతు పనులన్నీ 15 రోజుల్లో పూర్తిచేసి రోడ్లన్నీ తళతళ లాడే విధంగా చేస్తామని వెల్లడిం చారు. మరమత్తులన్నీ పూర్తయితే మరో 2 సంవత్సరాల వరకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉంటుందని తెలిపారు. నగర అభివృద్ధికి ప్రజలు సహకరించాలని నూతనంగా నిర్మిం చిన రోడ్లు ధ్వంసం కాకుండా చూడా లని అన్నారు.. బిటి రోడ్లమీద నీరు నిల్వకుండా మునిసిపల్ అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని ఆదేశించారు.. రోడ్లమీద నీరు నిలిస్తే ఎటు వంటి బీటీ రోడ్ అయినా ధ్వంసం అవుతుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ సేవా ఇస్లావత్ మున్సిపల్ ఈఈ నాగ మల్లేశ్వర్ రావు , ఆర్‌డబి ఈఈ సాంబ శివరావు, డిఈ రవీందర్, ఏఈ లక్ష్మణ్ రావు, కార్పొరేటర్లు లెక్కల స్వప్న ? వేణుగోపాల్ దిండిగాల మహేష్, గుగ్గిళ్ళ జయశ్రీ -శ్రీనివాస్, కంసాల శ్రీనివాస్, పుట్ట నరేందర్, వంగల పవన్ కుమార్, సుడా డైరెక్టర్ నేతి రవివర్మ ,మిడిదొడ్డి నవీన్ కుమార్ కొలిపాక శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ తాటి ప్రభావతి పాల్గొన్నారు.

## చండూరులో సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో బహిరంగ సభ



నల్గొండ, అక్టోబర్ 11:నల్గొండ మునుగోడు ఉప ఎన్నికల ప్రచారం జోరందుకుంది. టీఆర్ఎస్ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి గెలుపు కోసం చండూరులో సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, మాజీ ఎమ్మెల్యేలు చాడా వెంకట్ రెడ్డి, నంద్యాల నర్సింహారెడ్డి, జూలకంటి రంగారెడ్డి, పల్లా వెంకట్ రెడ్డి, ఉజ్జిని యాదగిరి రావు, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములుతోపాటు టీఆర్ఎస్ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి హాజరయ్యారు.

సభకు సిపిఎం, సిపిఐ శ్రేణులు భారీగా తరలివచ్చారు.

## తిరుమలలో గదుల కేటాయింపు వ్యవస్థ తిరుపతికి తరలింపు : టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి



తిరుమల, అక్టోబర్ 11: తిరుమలలో ఉన్న గదుల కేటాయింపు వ్యవస్థను త్వరలో తిరుపతిలో చేపట్టనున్నట్లు టీటీడీ ఈవో ఎవి.ధర్మారెడ్డి తెలిపారు. తిరుమల అన్నమయ్య భవనంలో డయల్ యువర్ ఈవో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో టీటీడీ చేపట్టిన పలు కార్యక్రమాల గురించి భక్తులకు వివరించారు. టీటీడీలోని అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది, జిల్లా యంత్రాంగం, పోలీసులు, శ్రీవారి సేవకుల సమిష్టి కృషి, భక్తుల సహకారంతో శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు విజయవంతం అయ్యాయి. టీటీడీ అధికారులు, సిబ్బంది, ఎస్వీబీసీతోపాటు తమ ఛానళ్లలో శ్రీవారి వైభవాన్ని భక్తులకు తెలియజేసిన ప్రచార, ప్రసార సాధనాల ప్రతినిధులకు మరోమారు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి సెప్టెంబరు 27వ తేదీ తిరుపతి నుండి తిరుమలకు విద్యుత్ బస్సులు ప్రారంభించారు. స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించి పెద్దశేష వాహన సేవలో పాల్గొన్నారు. తిరుమలలో ఉన్న గదుల కేటాయింపు వ్యవస్థను తిరుపతిలో చేపట్టాలని నిర్ణయం. తద్వారా తిరుమలలో గదులు దొరకని భక్తులు తిరుపతిలోనే వసతి పొందే అవకాశం ఉంటుంది. త్వరలో ప్రయోగాత్మకంగా ఈ విధానాన్ని మొదలుపెడతాం. శ్రీవారి దర్శనార్థం కంపార్ట్‌మెంట్లలో రాత్రి వేళ వేచి ఉండే సామాన్య భక్తులకు ఉదయం త్వరగా దర్శనం కల్పించేందుకు వీలుగా ఉదయం ఉన్న విఐపి బ్రేక్ దర్శన సమయాన్ని ఉదయం 10 గంటలకు మార్పు చేసి ప్రయోగాత్మకంగా అమలుచేస్తాం. పెరటాసి మాసం మూడో శనివారంతో పాటు వరుస సెలవులు రావడంతో తిరుమలలో భక్తుల రద్దీ పెరిగింది. తిరుమలకు వచ్చే భక్తుల దర్శనానికి దాదాపు 48 గంటల సమయం పడుతోంది. భక్తులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరుతున్నాం.

తిరుమలలో శ్రీ వేంకటేశ్వరస్వామివారికి జరిగే నిత్య, వారసేవలు, ఉత్సవాలను ఇతర ప్రాంతాల్లోని భక్తులు దర్శించేందుకు వీలుగా దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో శ్రీ వేంకటేశ్వర వైభవోత్సవాలు నిర్వహిస్తున్నాం. ఇందులో భాగంగా అక్టోబరు 11 నుండి 15వ తేదీ వరకు హైదరాబాద్ ఎన్‌టిఆర్ స్టేడియంలో ఈ ఉత్సవాలు జరుగనున్నాయి. అక్టోబరు 11న వసంతోత్సవం, 12న సహస్ర కలశాభిషేకం, 13న తిరుప్పావడ, 14న నిజపాద దర్శనం, 15న సాయంత్రం 6.30 నుండి 8.30 గంటల వరకు శ్రీనివాస కల్యాణం జరుగనున్నాయి. డిసెంబరులో ప్రకాశం జిల్లా ఒంగోలు, జనవరిలో ఢిల్లీ లో శ్రీ వేంకటేశ్వర వైభవోత్సవాలు నిర్వహిస్తాం. పవిత్రమైన కార్తీక మాసంలో గత ఏడాది తరహాలో విశాఖపట్నం, కర్నూలు జిల్లా యాగంటిలో కార్తీక దీపోత్సవాలు నిర్వహిస్తాం. ఉత్తరాయణంలో చెన్నైలోని శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయం, జమ్మూలోని శ్రీవారి ఆలయాలకు మహాసంప్రోక్షణ చేపడతాం. అహ్మదాబాద్ నగరంలో శ్రీవారి ఆలయ నిర్మాణానికి గుజరాత్ ప్రభుత్వం 5 ఎకరాల స్థలం ఇచ్చింది. త్వరలో భూమిపూజ చేస్తాం. అక్టోబరు నెలలో ఏజన్సీ ప్రాంతాలైన అనకాపల్లి, అరకు, రంపచోడవరం తదితర ప్రాంతాల్లో శ్రీనివాస కల్యాణాలు నిర్వహిస్తాం.

## బి 20 ఇండోనేషియా గ్లోబల్ డైలాగ్‌పై సమావేశాన్ని నిర్వహించిన డిపార్ట్‌మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్ (డిపిఐఐటి)

న్యూఢిల్లీ, అక్టోబర్ 11: డిపార్ట్‌మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్ (డిపిఐఐటి) ఈరోజు న్యూఢిల్లీలో కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సిఐఐ) భాగస్వామ్యంతో బి20 ఇండోనేషియా గ్లోబల్ డైలాగ్‌పై కాన్ఫరెన్స్‌ను నిర్వహించింది. ఇండోనేషియా విధాన సిఫార్సులతో భారతీయ పరిశ్రమ దృక్కోణాలను సమలేఖనం చేసే లక్ష్యంతో ఇది ఏర్పాటు చేయబడింది. ఈ సమావేశం బి20 ఇండోనేషియా విధాన సిఫార్సులో భారతీయ దృక్కోణాలు బాగా ప్రాతినిధ్యం వహిస్తున్నాయని నిర్ధారించడానికి చర్చలను రూపొందిస్తుంది.

బిజినెస్ 20 (బి20) 2010లో ఏర్పడింది. ఇది ప్రపంచ వ్యాపార సంఘంతో అధికారిక జి20 డైలాగ్ ఫోరమ్. ఆర్థిక వృద్ధి మరియు అభివృద్ధిని ప్రోత్సహించడానికి ప్రతి రొటేటింగ్ ప్రెసిడెన్సీ ద్వారా ప్రాధాన్యతలపై నిర్దిష్ట చర్య తీసుకోదగిన విధాన సిఫార్సులను అందించడం లక్ష్యంగా బి20 పెట్టుకుంది.

ఇండోనేషియా నుండి 20 మందికి పైగా వ్యాపార ప్రతినిధులు కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు. ఈ సదస్సుకు మిస్టర్ ఎం అర్షాద్ రష్జిద్ పి.ఎం, ఇండోనేషియా ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (కెఏడిఐఎన్), ఎంఎస్. షింటావిడ్జాజాకామ్‌దాని, చైర్, బి20 ఇండోనేషియాతో పాటు భారత్‌లోని ఇండోనేషియా రాయబారి హెచ్.ఈ. ఇనా హెచ్.కృష్ణమూర్తి హాజరయ్యారు.

భారత ప్రభుత్వం తరపున జి20కి భారతదేశ షెర్పా శ్రీ అమితాబ్ కాంత్, పరిశ్రమ మరియు అంతర్గత వాణిజ్య ప్రమోషన్ విభాగం కార్యదర్శి శ్రీ అనురాగ్ జైన్ మరియు డిపిఐఐటి మరియు ఇతర సంబంధిత మంత్రిత్వ శాఖలకు చెందిన ఇతర సీనియర్ అధికారులు ప్రాతినిధ్యం వహించారు.

భారతీయ పరిశ్రమకు అనేక మంది నాయకులు ప్రాతినిధ్యం వహించారు; వీరిలో శ్రీ చంద్రజిత్ బెనర్జీ, డిజి, సిఐఐ; డాక్టర్ నౌషాద్ ఫోర్బ్స్, కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సిఐఐ) మరియు శ్రీ దీపక్ బాగ్లా, ఎండి ఉ సిఈఓ, ఇన్వెస్ట్ ఇండియా ఉన్నారు.

ప్లీనరీ మరియు పరిచయ వ్యాఖ్యలు అయిన అనంతరం (తి)వాణిజ్యం ఉ పెట్టుబడి (తితి) శక్తి, సుస్థిరత ఉ వాతావరణం (తితితి) డిజిటలైజేషన్ మరియు (తిల) ఫైనాన్స్ మరియు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌పై చర్చలు జరిగాయి. ఇందులో బి20 ఇండోనేషియా నుండి దృక్కోణాలు భారతీయ పరిశ్రమ మరియు ప్రభుత్వ దృక్కోణాలను అనుసరించాయి.

జి 20 అనేది 19 దేశాలు + ఈయూల ఉమ్మడి కూటమి. ఇది ప్రపంచ జీడీపీలో 85%, ప్రపంచ వాణిజ్యంలో 75% మరియు ప్రపంచ జనాభాలో 60%కి ప్రాతినిధ్యం వహిస్తుంది. జి20 సభ్యులు: అర్జెంటీనా, ఆస్ట్రేలియా, బ్రెజిల్, కెనడా, చైనా, ఫ్రాన్స్, జర్మనీ, ఇండియా, ఇండోనేషియా, ఇటలీ, జపాన్, రిపబ్లిక్ ఆఫ్ కొరియా, మెక్సికో, రష్యా, సౌదీ అరేబియా, దక్షిణాఫ్రికా, టర్కీ, యునైటెడ్ కింగ్‌డమ్, యునైటెడ్ స్టేట్స్ , మరియు యూరోపియన్ యూనియన్. ప్రస్తుతం ఇండోనేషియా జి20 అధ్యక్ష పదవిని కలిగి ఉంది.

ఈ చర్చ 13-14 నవంబర్ 2022న ఇండోనేషియాలో జరిగే బి20 ఫైనల్ సమ్మిట్‌కు మార్గం సుగమం చేస్తుంది.

## చిత్తూరు జిల్లాలో విషాదం.. బావిలో పడి ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురి మృతి..

చిత్తూరు,అక్టోబర్ 11: చిత్తూరు జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. మంగళవారం వి.కోట మండలం జవ్వునిపల్లెలో తల్లి, ఇద్దరు పిల్లలు బావిలో పడి మృతి చెందారు.

జవ్వుని పల్లెకు చెందిన వెంకటరమణ భార్య అరుణ (28), కుమారులు హరీష్(7), జతిన్ (5) మృతి చెందగా.. అత్తింటి వారిపైనే అనుమానం ఉందని బంధువులు ఆరోపిస్తున్నారు.

తోటి కోడలే వారిని బావిలోకి తోసిందంటుందని మృతురాలి బంధువులు ఆందోళనకు దిగారు.

సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతికి గల వివరాలు సేకరించారు. హత్య లేక ఆత్మహత్య అనే విషయం తెలియాల్సి ఉంది.

# చిత్తూరు జిల్లాలో విషాదం.. బావిలో పడి ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురి మృతి..



చిత్తూరు, అక్టోబర్ 11: చిత్తూరు జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. మంగళవారం వి.కోట మండలం జవ్వునిపల్లెలో తల్లి, ఇద్దరు పిల్లలు బావిలో పడి మృతి చెందారు. జవ్వుని పల్లెకు చెందిన వెంకటరమణ భార్య అరుణ (28), కుమారులు హరీష్(7), జతిన్ (5) మృతి చెందగా.. అత్తింటి వారిపైనే అనుమానం ఉందని బంధువులు ఆరోపిస్తున్నారు. తోటి కోడలే వారిని బావిలోకి తోసిందంటుందని మృతురాలి బంధువులు ఆందోళనకు దిగారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతికి గల వివరాలు సేకరించారు. హత్య లేక ఆత్మహత్య అనే విషయం తెలియాల్సి ఉంది.

# గడపగడపనూ తాకాలి.. ప్రజలతో మమేకం కావాలి : మంత్రి నిరంజన్ రెడ్డి



నల్గొండ, అక్టోబర్ 11: కేసీఆర్ కిట్, రైతుబంధు, రైతుభీమా, కళ్యాణలక్ష్మి, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ వంటి పథకాలు దేశంలోని మరే రాష్ట్రంలో లేవు అని, దేశంలో 50 లక్షల ఆసరా ఫించన్లు అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. మర్రిగూడ మండలం దేవర భీమనపల్లిలో టీఆర్ఎస్ కార్యకర్తల సమ్మేళనంలో రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తోపాటు ఎంపిటీసీ విష్ణు, మాజీ సర్పంచ్ అంతిరెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసులు, వార్డు మెంబర్లు తిరుమల్ రెడ్డి, చాంద్ పాష, అంజా చారి , సీనియర్ నాయకులు నాగిరెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు. అక్కడే పార్టీ కార్యకర్తలతో కలిసి టీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్ లో మంత్రి పాల్గొన్నారు. అనంతరం భోజ్య తండా, భీమ్లా తండాలలో ప్రచారం మంత్రి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ? సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి పనులలో దేశంలో తెలంగాణతో పోటీ పడగలిగే రాష్ట్రం మరొకటి లేదన్నారు.

దశాబ్దాల పాటు ఫ్లోరైడ్ సమస్యతో ఈ ప్రాంతం మూడు తరాలను నష్టపోయిందని, ముఖ్యమంత్రి కేసీఆర్ ఉద్యమ సమయంలో స్వయంగా ఫ్లోరైడ్ సమస్యపై పాటలు రాశారని గుర్తు చేశారు. సీఎం కేసీఆర్ మునుగోడు, దేవరకొండ ప్రాంతాల్లో బస్సు యాత్ర చేశారు, అధికారంలోకి వచ్చిన ఐదేళ్లలో ఫ్లోరైడ్ ప్రాంతాలకు రక్షిత తాగునీరు అందించారన్నారు. కేసీఆర్ నాయకత్వం, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు మూలంగానే ఇది సాధ్యమయిందన్నారు. మునుగోడు కష్టాలు తీర్చింది టీఆర్ఎస్, తీర్చబోయేది టీఆర్ఎస్ మాత్రమే అన్నారు.

ప్రజల ఆశీస్సులు టీఆర్ఎస్ పార్టీకి ఉన్నాయని, నాయకులందరూ సమన్వయంతో పనిచేయాలన్నారు. భారీ మెజారిటీతో కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డిని గెలిపించాలని పిలుపునిచ్చారు.

# లోక రక్షకుడు యాషువ మెస్సీయ్య

- మెస్సీయ జన్మదినమే పర్ణశాలల పండుగ
- లోకపాప పరిహారార్థమై ఆయన జన్మించెను
- నమ్మినవారు ధన్యులు వారిదే పరలోకరాజ్యం
- యావే సమాజ ప్రార్థన మందిర పాస్టర్ పాలడుగు రత్నపాల్

ఖమ్మం, అక్టోబర్ 11 (నేటినిజం ప్రతినిధి): లోక రక్షకుడు యాషువ మెస్సీయ అని యావె సమాజ ప్రార్థన మందిర పాస్టర్ పాలడుగు రత్నపాల్ అన్నారు. యాషువ మెస్సీయ జన్మదినాన్ని పురస్కరించుకుని మంగళవారం ఖమ్మం నగరంలోని అంబేద్కర్ భవన్లో పర్ణశాలల పండుగ మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పర్ణశాలల పండుగ గురించి పాస్టర్ రత్నపాల్ మాట్లాడుతూ.. ఈ లోకపాప పరిహారార్థమై యాషువ మెస్సీయ వారు జన్మించారు. నమ్మినవారు ధన్యులు వారిదే పరలోకరాజ్యం అన్నారు.

యాషువ మెస్సీయ జన్మదినమైన పర్ణశాలల పండుగ బైబిల్ క్యాలెండర్ ప్రకారం 7వ నెల ఏతనీము 15వ తేదీన పుట్టాడని, దానినే పర్ణశాలల పండుగ అంటారని తెలిపారు బైబిలంతటిలో ప్రవక్తలు, యాషువ మెస్సీయ, శిష్యులు, అపోస్తులలు పండుగను అనుసరిస్తూ ఆచరించారని పేర్కొన్నారు. ఇది ఎనిమిది దినములు ఉత్సవముతో కూడిన పర్ణశాలల పండుగని, ఇది దేవుని ప్రజలైన ఇశ్రాయేలీయుల ఆచారమన్నారు. పర్ణశాలల పండుగ గూర్చి బైబిల్ అంతటిలో 359 సార్లు గొప్పగా వ్రాయబడిందని, ఇది సెప్టెంబర్-అక్టోబర్లో వచ్చే పౌర్ణమికి దగ్గరగా ఉంటుందని తెలిపారు. కుటుంబ సమేతంగా ఆచరించాల్సిన పండుగన్నారు. బైబిల్ పండుగలు, (సబ్బాత్)విశ్రాంతిదినం, నెలపొడుపు దినం, ధర్మశాస్త్రము అనుసరించేవారు మాత్రమే పరలోక రాజ్యానికి వారసులని స్పష్టం చేశారు. కానీ బైబిల్ లో లేని పండుగలు, దినాలు, సంఘాలను సృష్టించి, మానవ కల్పిత ఆచారాలను గ్రహించక అబద్ధబోదను ప్రకటిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పరిశుద్ధ గ్రంథమైన బైబిల్ ను క్షేత్రస్థాయిలో నిశిత పరిశీలన చేసి అత్యంత భక్తిశ్రద్ధలతో సత్యమైన వాక్యాన్ని గ్రహించి ఆచరించాలని విజ్ఞప్తి

చేశారు. భక్తి శ్రద్ధలతో విశ్వాసులు, యువకులు పాటలు పాడి ఆనందింపజేశారు. చిన్నారుల నృత్యాలు ఎంతో అలరించాయి. పండుగను పురస్కరించుకుని రాంపురం, వరంగల్, పైనంపల్లి, ఖమ్మం పట్టణం నుండి సుమారు 250మంది విశ్వాసులు పాల్గొన్నారు.

పండుగ సందర్భంగా నిర్వహించిన బైబిల్ క్విజ్ లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. సంగస్తుల సహకారంతో ఆచారం ప్రకారం వృద్ధులు, అనాదలు, విదవరాండ్రులకు, తల్లిదండ్రులు లేని పిల్లలకు చీరలు, దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం పాస్టర్లు, సంఘ పెద్దలు, సువార్త సహకారులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ పర్ణశాలల పండుగ మహోత్సవంలో బొజ్జ వివేక్, బాసింగు ప్రసాద్, మోదుగు మోసే, ప్రశాంత్, పౌలు(రూప్ల), కొరకొప్పుల డేవిడ్, అంబోజి జీవరత్నం, వంగూరి ఏలీయా, గడ్డం ఏబేలు, పాలడుగు జీవన్, మనోహ, పాలడుగు అనిత, కొరకొప్పుల సునీత, రిబ్కా, రూతు, స్వరూప, సుజాత, కళమ్మ, పుష్పమ్మ, ఎస్తేరు, వంగూరి సౌజన్య, యువకులు, చిన్నారులు పాల్గొన్నారు.



# ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా అన్ని రాష్ట్రాల్లో టెలి మెంటల్ హెల్త్ అసిస్టెన్స్ అండ్ నెట్ వర్కింగ్ (టెలి-మానస్) చొరవ ప్రారంభం

న్యూఢిల్లీ, అక్టోబర్ 11: ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా మానసిక ఆరోగ్య రంగంలో ఒక కొత్త మైలురాయిని నెలకొల్పడంగా, కేంద్ర ఆరోగ్య , కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ టెలీ మెంటల్ హెల్త్ అసిస్టెన్స్ అండ్ నెట్ వర్కింగ్ అక్రాస్ స్టేట్స్ (టెలి-మానస్) చొరవను బెంగుళూరు లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ అండ్ న్యూరోసైన్సెస్ (నిమ్హాన్స్)లో కర్ణాటక రాష్ట్ర ఆరోగ్య - కుటుంబ సంక్షేమ, వైద్య విద్య శాఖ మంత్రి నిమ్హాన్స్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ కె. సుధాకర్ సమక్షంలో.కర్ణాటక గవర్నర్ శ్రీ థావర్ చంద్ గెహ్లాట్ ఈ రోజు వర్చువల్ గా ప్రారంభించారు.

కోవిడ్-19 మహమ్మారి నేపథ్యంలో మానసిక ఆరోగ్య సంక్షోభం , మహమ్మారి వల్ల పెరిగిన సవాళ్లను తట్టుకునే డిజిటల్ మానసిక ఆరోగ్య నెట్ వర్క్ ను ఏర్పాటు చేయాల్సిన తక్షణ అవసరాన్ని గుర్తించిన భారత ప్రభుత్వం 2022-23 కేంద్ర బడ్జెట్లో నేషనల్ టెలి మెంటల్ హెల్త్ ప్రోగ్రామ్ (ఎన్ టి ఎం హెచ్ పీ)) ని ప్రకటించింది.

టెలి-మానస్ దేశవ్యాప్తంగా 24 గంటలూ ఉచిత టెలీ-మెంటల్ హెల్త్ సేవలను అందించాలని లక్ష్యంగా పెట్టుకుంది, ప్రత్యేకించి మారుమూల లేదా తక్కువ-సేవలు గల ప్రాంతాల్లోని ప్రజలకు సేవలు అందిస్తుంది. ఈ కార్యక్రమంలో 23 టెలీ-మెంటల్ హెల్త్ సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ నెట్వర్క్ ఉంది, నిమ్హాన్స్ నోడల్ సెంటర్ గా ఉంటుంది. ఇంటర్నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ-బెంగళూరు (ఐఐఐటిబి) టెక్నాలజీ మద్దతును అందిస్తుంది. ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటి) బెంగళూరు , నేషనల్ హెల్త్ సిస్టమ్స్ రిసోర్స్ సెంటర్ (ఎన్ హెచ్ ఆర్ ఎస్ సి) సాంకేతిక మద్దతును అందిస్తాయి.

ప్రతి రాష్ట్రం/కేంద్ర పాలిత ప్రాంతంలో కనీసం ఒక టెలి-మానస్ సెల్ ను ప్రారంభించాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది

ఈ సేవల కోసం దేశవ్యాప్తంగా టోల్ ఫ్రీ, 24/7 హెల్ప్ లైన్ నెంబరు (14416) ను ఏర్పాటు చేశారు. తద్వారా ఫోన్ చేసే వారు సేవలను పొందడానికి తమ భాషను ఎంచుకోవడానికి వీలు కల్పించారు. సంబంధిత రాష్ట్రం లేదా కేంద్రపాలిత ప్రాంతంలోని టెలి-మానస్ సెల్స్ కు కాల్స్ ను మళ్ళిస్తారు.

టెలి-మానస్ ను రెండు అంచెల వ్యవస్థలో నిర్వహిస్తారు; టైర్ 1లో రాష్ట్ర స్థాయి టెలి-మానస్ విభాగాలు ఉంటాయి, వీటిలో శిక్షణ పొందిన కౌన్సిలర్లు, మానసిక ఆరోగ్య నిపుణులు ఉంటారు. టైర్ 2లో ఫిజికల్ కన్సల్టేషన్ కోసం డిస్ట్రిక్ట్ మెంటల్ హెల్త్ ప్రోగ్రామ్ (డి ఎం హెచ్ పీ)/మెడికల్ కాలేజ్ రిసోర్సెస్/లేదా ఆడియో విజువల్ కన్సల్టేషన్ కోసం ఇ-సంజీవని స్పెషలిస్టులు ఉంటారు. ప్రస్తుతం ఐదు ప్రాంతీయ సమన్వయ కేంద్రాలతో పాటు 51 స్టేట్/యుటి టెలి మానస్ కేంద్రాలు ఉన్నాయి.

సెంట్రలైజ్డ్ ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టమ్ ( ఐ వి ఆర్ ఎస్) ద్వారా ప్రాథమిక మద్దతు , సలహాలు అందించే ప్రారంభ దశ ను స్థిరపరుస్తున్నారు. ఇది తక్షణ మానసిక ఆరోగ్య సంరక్షణ సేవలను అందించడంలో సహాయపడటమే కాకుండా, సంరక్షణ కొనసాగింపును కూడా సులభతరం చేస్తుంది. నేషనల్ టెలీ కన్సల్టేషన్ సర్వీస్ , ఇ-సంజీవని, ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్, మానసిక ఆరోగ్య నిపుణులు, ఆయుష్మాన్ భారత్ హెల్త్ అండ్ వెల్ నెస్ సెంటర్లు , ఎమర్జెన్సీ సైకియాట్రిక్ ఫెసిలిటీస్ వంటి ఇతర సర్వీసులతో టెలి-మానస్ ను అనుసంధానం చేయడం ద్వారా ప్రత్యేక సంరక్షణకు దీనిని ఉద్దేశించారు. అంతిమంగా ఇది మొత్తం మానసిక స్వస్థత, అనారోగ్య నివారణ పై దృష్టి పెడుతుంది. మానసిక ఆరోగ్య సంరక్షణను అందించే అన్ని వ్యవస్థల ను ఏకీకృతం చేస్తుంది. నిమ్హాన్స్ మెజారిటీ రాష్ట్రాలు/ కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన 900 మంది టెలీ మానస్ కౌన్సిలర్లకు శిక్షణ ఇచ్చింది.వీటిలో ఎయిమ్స్, పాట్నా, ఎయిమ్స్ రాయ్ పూర్, సిఐపి రాంచీ, ఎయిమ్స్, భోపాల్, ఎయిమ్స్ ,కళ్యాణి, ఎయిమ్స్ , భువనేశ్వర్, పిజిఐఎంఇఆర్, చండీగఢ్, హాస్పిటల్ ఫర్ మెంటల్ హెల్త్, అహ్మదాబాద్, గుజరాత్, ఇన్ స్టిట్యూట్ ఆఫ్ సైకియాట్రీ అండ్ హ్యూమన్ బిహేవియర్ బాంబోలిమ్ గోవా, ఎయిమ్స్, నాగ్ పూర్, ఎయిమ్స్, జోధ్ పూర్, కెజిఎంయు, లక్నో, ఎయిమ్స్ రిషికేష్, ఐహెచ్ బిఎఎస్, ఢిల్లీ, ఐజిఎంఎస్, సిమ్లా, సైకియాట్రిక్ డిసీజెస్ హాస్పిటల్, గవర్నమెంట్ మెడికల్ కాలేజ్, శ్రీనగర్, ఎల్ జిబిఆర్ హెచ్, తేజ్ పూర్,నింహాన్స్, బెంగళూరు, ఐఎంహెచ్ ఎఎస్, కోజికోడ్, కేరళ, ఐఎంహెచ్, చెన్నై, ఐఎంహెచ్, హైదరాబాద్, జిప్మర్ అండ్ ఎయిమ్స్, మంగళగిరి ఉన్నాయి.

ఆంధ్రప్రదేశ్, అస్సాం, అండమాన్- నికోబార్ దీవులు, చత్తీస్ గఢ్, దాద్రా నగర్ హవేలీ , డామన్ అండ్ డయ్యూ, గుజరాత్, హిమాచల్ ప్రదేశ్, జమ్మూ - కాశ్మీర్, కర్ణాటక, కేరళ, లడఖ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒడిశా, పంజాబ్, రాజస్థాన్, తమిళనాడు, తెలంగాణ, ఉత్తరప్రదేశ్ , పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలు/ కేంద్రపాలిత ప్రాంతాలు నేడు టెలి మెంటల్ హెల్త్ ప్రోగ్రామ్ ను ప్రారంభించాయి.

ఈ కార్యక్రమంలో నిమ్హాన్స్ డైరెక్టర్ డాక్టర్ ప్రతిమా మూర్తి, శ్రీ విశాల్ చౌహాన్, జెఎస్ (ఎంఒహెచ్ ఎఫ్ డబ్ల్యు), విద్యార్థులు, అధ్యాపకులు, ఇతర ప్రముఖులు, మంత్రిత్వ శాఖ కు చెందిన సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

# జయప్రకాష్ను ఆదర్శంగా తీసుకొని యువత ముందుకు వెళ్లాలి: వెంకయ్య నాయుడు



మహబూబ్నగర్, అక్టోబర్ 11యువత లోక్ నాయక్ జయప్రకాష్ నారాయణను ఆదర్శంగా తీసుకుని ముందుకు వెళ్లాలని భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. మహబూబ్ నగర్ జిల్లా ధర్మాపూర్ వద్ద ఉన్న జయప్రకాష్ నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో.. కళాశాల సిల్వర్ జూబ్లీ వేడుకల్లో భాగంగా జయప్రకాష్ నారాయణ విగ్రహాన్ని.. మాజీ కేంద్రమంత్రి జైపాల్ రెడ్డి విగ్రహాన్ని మంత్రులు శ్రీనివాస్ గౌడ్ సింగిరెడ్డి నిరంజన్ రెడ్డితో కలిసి వెంకయ్య నాయుడు ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు మాట్లాడుతూ? అన్యాయాలకు.. అక్రమాలకు అరాచకానికి వ్యతిరేకంగా ప్రజాస్వామ్య వటిష్టతకు అలుపెరగకుండా పోరాటం చేసిన గొప్ప నాయకుడు జయప్రకాష్ నారాయణ అని కొనియాడారు. విద్యార్థులందరూ తప్పనిసరిగా మాతృభాషను నేర్చుకోవాలని ఆ తర్వాత ఇతర భాషల పట్ల మక్కువ పెంచుకోవాలని సూచించారు. ఆంగ్ల భాషలో చదువుతేనే ఉన్నత స్థానాలకు ఎదుగుతామని యువతలో ఈ భావన నాటుక పోయిందని, దాన్ని విడనాడాలని సూచించారు. మాతృభాషలో చదివిన వారు ఎంతో గొప్ప వ్యక్తులుగా ఎదిగిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు.

# 'గిఫ్ట్ స్పెషల్ ఎకనామిక్ జోన్' పనితీరును సమీక్షించిన వాణిజ్య మంత్రి

న్యూఢిల్లీ, అక్టోబర్ 11: కేంద్ర వాణిజ్యం, పరిశ్రమలు, వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణి, జౌళి శాఖ మంత్రి శ్రీ పీయూష్ గోయల్ గిఫ్ట్ స్పెషల్ ఎకనామిక్ జోన్ పనితీరును సమీక్షించారు. గుజరాత్లోని సెజ్, డీసీ గిఫ్ట్ కార్యాలయం నిర్వహణకు సంబంధించిన పలు నియంత్రణ అంశాలకు సంబంధించిన సమస్యలను సమీక్షించారు. గిఫ్ట్ సిటీలో పరిశ్రమ ప్రతినిధులతో మంత్రి సంభాషించారు.

"గిఫ్ట్ సిటీలో పరిశ్రమ ప్రతినిధులతో ఫలవంతమైన చర్చలు నిర్వహించడం జరిగింది. ఇక్కడ యూనిట్ల ఏర్పాటు వల్ల కలిగే ప్రయోజనాలను చర్చించారు. ఎగుమతుల ప్రమోషన్, తయారీలో 'మేక్ ఇన్ ఇండియా' వంటి వాటితో సహా అద్భుతమైన సూచనలను అందుకున్నాం" అని శ్రీ గోయల్ తన సమావేశం గురించి ట్వీట్ చేశారు.

### ఆభరణాల రంగ ప్రతినిధులతో చర్చలు..

దేశ బంగారం వ్యాపారానికి సంబంధించిన సమస్యలను అర్థం చేసుకోవడానికి గిఫ్ట్ సిటీ లోని ఇంటర్నేషనల్ బులియన్ ఎక్స్ఛేంజ్ (ఐఐబీఎక్స్) వారితో మంత్రి చర్చలు జరిపారు; గోల్డ్ స్పాట్ ఎక్స్ఛేంజ్ని అమలు చేయడం, గిఫ్ట్ ఐఎఫ్ఎస్సీ ద్వారా ఆభరణాల ఎగుమతిదారుల కోసం గోల్డ్ మెటల్ రుణాల ధరను తగ్గించడం గురించి ఈ చర్చల్లో ముచ్చటించారు. "ఇండియా ఇంటర్నేషనల్ బులియన్ ఎక్స్ఛేంజ్ (ఐఐబీఎక్స్), గిఫ్ట్ సిటీ ప్రపంచ వ్యాప్తంగా ఉన్న వాటిలో ఒకటి. ఐఐబీఎక్స్ ద్వారా బంగారం పోటీ ధరలను కనుగొనాలని ఆభరణాల రంగ ప్రతినిధులను కోరారు. భారతదేశం-యుఏఈ సీఈపీఏ వారికి ఎలాంటి గొప్ప అవకాశాలను కల్పిస్తుందో కూడా వివరించా?ం" అని ఆయన ట్వీట్ చేశారు. యుఏఈ ఎఫ్టీఏలో పొందిన బంగారంపై టీఆర్క్యూ వినియోగాన్ని ఐఐబీక్స్ నుండి ఆపరేట్ చేయడంతో సహా, ఐఐబీఎక్స్లో బంగారం వ్యాపారాన్ని మెరుగుపరచడానికి ఆదేశాలు జారీ చేశారు.

### ఐఎఫ్ఎస్సీఏ ప్రతినిధులతోనూ సమావేశం..

శ్రీ గోయల్ గిఫ్ట్ సిటీలో ఇంటర్నేషనల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సెంటర్స్ అథారిటీ (ఐఎఫ్ఎస్సీఏ) ప్రతినిధులను కలుసుకున్నారు. డీసీ గిఫ్ట్ సెజ్ మరియు ఐఎఫ్ఎస్సీఏ కార్యాలయంతో వివిధ పరిపాలనా సమస్యలను పరిష్కరించారు. ఐఎఫ్ఎస్సీఏ అనేది ఈపీసీ మరియు ఎగుమతిదారులతో ఎగుమతుల కాలానుగుణ సమీక్షలో పాల్గొనడం మరియు బంగారం ఎగుమతులను పెంచడానికి ఐఎఫ్ఎస్సీ ఆర్థిక అవస్థాపనను ఏ విధంగా ఉపయోగించవచ్చో తనిఖీ చేయడం తదితర వ్యవహారాలను పర్యవేక్షిస్తుంది.

### ఐ-హబ్లో యువ ఆవిష్కర్తలతోనూ సంభాషించారు..

"భారత వృద్ధి కథనం నుండి లాభపడే ప్రపంచ పెట్టుబడిదారులకు మెరుగైన వ్యాపారం చేయడం ద్వారా ఐఎఫ్ఎస్సీ ఆర్థిక వృద్ధికి కీలక చోదకంగా మారుతుంది" అని మంత్రి ఈ సమావేశంలో ట్వీట్ చేశారు. మంత్రి శ్రీ గోయల్ గిఫ్ట్ నగరంలో బ్యాంకర్లు, ఫండ్ మేనేజర్లు, డెరివేటివ్ ఎక్స్ఛేంజ్ మేనేజ్మెంట్, విమానయాన పరిశ్రమ ప్రతినిధులతో కూడిన వివిధ యూనిట్ల అధిపతులతో కూడా ముచ్చటించారు. సీడీఎల్ డీజీఎఫ్టీ మరియు సెజ్ యొక్క అనుబంధ కార్యాలయాలతో వారి మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. గిఫ్ట్ సిటీలో అందుబాటులో ఉన్న సౌకర్యాల నుండి స్టార్ట్ అప్ ఎకోసిస్టమ్ ప్రయోజనం పొందగలదా అని అంశాన్ని అన్వేషించేందుకు గాను పరిశ్రమ మరియు అంతర్గత వాణిజ్య ప్రోత్సాహక శాఖ (డీపీఐఐటీ)కి మంత్రి ఆదేశాలు జారీ చేశారు. అంతకుముందు మంత్రి ఐ-హబ్లో యువ ఆవిష్కర్తలు మరియు స్టార్టప్ల వారితో సంభాషించారు. "గుజరాత్ మరియు దాని ప్రజలకు అంతర్భాగమైన ఆవిష్కరణల స్ఫూర్తి. ఐ-హబ్లో యువ ఆవిష్కర్తలు మరియు స్టార్టప్లతో సంభాషించడం ఆనందంగా ఉంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీజీ ఆలోచనలు భారతదేశ భవిష్యత్తు అభివృద్ధికి ఎలా బాటలు వేస్తున్నాయో వారితో పంచుకున్నాను" అని మంత్రి ఈ సందర్భంగా ట్వీట్ చేశారు.

# ఏపీలో ఏడుగురు డీఎంహెచ్వోల నియామకం

అమరావతి: అక్టోబర్ 11:ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని ఏడు జిల్లాలకు డీఎంహెచ్వోలను నియమించింది. అల్లూరి జిల్లాకు డాక్టర్ జమాల్ పాషా, తూర్పు గోదావరి జిల్లాకు కె.వెంకటేశ్వరరావు, పశ్చిమ గోదావరికి డి.మహేశ్వరరావు, బాపట్లకు విజయమ్మ, చిత్తూరుకు వై.వెంకటేశ్వరరావు, శ్రీసత్యసాయి జిల్లాకు కృష్ణారెడ్డి, కాకినాడ జిల్లా డీఎంహెచ్వోగా శాంతిప్రభ లను ప్రభుత్వం నియమించింది.







# ములాయంసింగ్ పార్థివ దేహానికి నివాళులర్పించిన చంద్రబాబునాయుడు



న్యూఢిల్లీ, అక్టోబర్ 11: టిడిపి అధినేత చంద్రబాబునాయుడు..యూపీ మాజీ సీఎం ములాయం సింగ్ యాదవ్ పార్థివ దేహానికి నివాళులర్పించారు.

ములాయం కుమారుడు, మాజీ సీఎం అఖిలేశ్ యాదవ్ తో పాటు, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా చంద్రబాబుతో పాటు ఇతర టీడీపీ నేతలు గల్లా జయదేవ్, కనకమేడల తదితరులు ఉన్నారు.

ములాయం సింగ్ అంత్యక్రియలు ఆయన స్వగ్రామం సైఫాయిలో జరగనున్నాయి. నేడు ఢిల్లీ చేరుకున్న చంద్రబాబు అక్కడి నుంచి సైఫాయికి వెళ్లారు. అంతిమ సంస్కారాలు ముగిసిన తర్వాత ఆయన తిరిగి ఢిల్లీకి చేరుకుని, అక్కడి నుంచి విజయవాడకు బయల్దేరుతారు. మరోవైపు, మలాయం అంత్యక్రియలకు తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా హాజరవనున్నారు.

# పీహెచ్ డీ సంపాదించిన ఎమ్మెల్యే సీతక్క-ఆసక్తికర వ్యాఖ్యలు



ములుగు , అక్టోబర్ 11 (నేటినిజం ప్రతినిధి): ములుగు ఎమ్మెల్యే సీతక్క ఓ విద్యార్థిని మాదిరిగా పరిశోధన చేసి? ఆ పరిశోధనా పత్రాన్నిఉస్మానియా వర్సిటీకి సమర్పించి పీహెచ్డీ సంపాదించారు. ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల్లో గుత్తికోయ గిరిజనుల సామాజిక స్థితిగతులపై అధ్యయనం చేసిన సీతక్క.. ఆ అంశంపై పరిశోధనా పత్రాన్ని సమర్పించారు. పొలిటికల్ సైన్స్లో ఆమె పూర్తి చేసిన ఈ పరిశోధనకే ఆమెకు వర్సిటీ అధికారులు మంగళవారం పీహెచ్డీ పట్టాను అందించారు. ఈ సందర్భంగా సీతక్క ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. నక్సలైట్గా ఉన్నప్పుడు తాను లాయర్ అవుతాననుకోలేదని, లాయర్గా ఉన్నప్పుడు ఎమ్మెల్యే అవుతాననుకోలేదని, ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు పీహెచ్డీ సాధిస్తానని అనుకోలేదన్నారు. ఇప్పుడు తనను డాక్టర్ సీతక్క అని పిలవొచ్చని కూడా ఆమె అన్నారు. ప్రజలకు సేవ చేయడం, జ్ఞానాన్ని పొందడం తనకు అలవాటని సీతక్క చెప్పారు. తన చివరి శ్వాస వరకు ఈ రెండు లక్షణాలను ఆపనని తెలిపారు. ఓయూ మాజీ వైస్ ఛాన్సలర్, ప్రస్తుతం మణిపూర్ వర్సిటీ ఛాన్సలర్గా పనిచేస్తున్న ప్రొఫెసర్ తిరుపతి రావు మార్గదర్శకత్వంలో సీతక్క తన పీహెచ్డీ పూర్తి చేశారు. ఎమ్మెల్యేగా ఉంటూ పీహెచ్డీ సాధించిన సీతక్కకు సోషల్ మీడియా వేదికగా ప్రశంసల వర్షం కురుస్తోంది.

# పోలీస్ సొసైటీలోన్ పరిమితి ఐదులక్షలకు పెంపు :సిపి

ఖమ్మం, అక్టోబర్ 11 (నేటినిజం ప్రతినిధి): సిబ్బంది సంక్షేమ కార్యక్రమంలో భాగంగా పోలీస్ అసోసియేషన్ విజ్ఞప్తి మేరకు గతంలో పోలీస్ కోపరేటివ్ సొసైటీ నుండి తీసుకునే మూడు లక్షల లోను పరిమితిని 5 లక్షల వరకు పెంచడం జరిగిందని పోలీస్ కమిషనర్ విష్ణు యస్. వారియర్ తెలిపారు. మంగళవారం పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్ తమ సభ్యులతో కలసి పోలీస్ కమిషనర్ కార్యాలయం పోలీస్ కమిషనర్ ని కలిసి దీపావళి కానుకగా కోపరేటివ్ సొసైటీ లోను పరిమితి పెంచాలని విజ్ఞప్తి చేశారు. సానుకూలంగా స్పందించిన పోలీస్ కమిషనర్ కుటుంబ సభ్యుల అత్యవసర చికిత్స కోసం వెంటనే నగదు పొందే వెసులుబాటు, చదువులకు, ఆడపిల్ల వివాహం కోసం కూడా లోన్ వెంటనే పొందవచ్చని తెలిపారు. సొసైటీలో లోన్ తీసుకుని, దుబారా చేసి కుటుంబాలను ఇబ్బంది పడకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

ఈ సందర్భంగా పోలీస్ అసోసియేషన్ కృతజ్ఞతలు తెలుపుతూ పుష్పగుచ్ఛం అందజేశారు.

కార్యక్రమంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ వేంకటేశ్వర్లు, జాయింట్ సెక్రటరీ జానిమియా, చక్రకళధర్ పాల్గొన్నారు.



# టపాసుల దుకాణాల అనుమతి కోసం దరఖాస్తు చేసుకోవాలి: సిపి



ఖమ్మం, అక్టోబర్ 11 (నేటినిజం ప్రతినిధి): ఖమ్మం జిల్లాలో టపాసులు దుకాణాలు పెట్టుకోదలచిన వ్యాపారులు ఈనెల 15వ తేది సాయంత్రంలోపు పోలీస్ కమిషనర్ కార్యాలయానికి సంబంధిత పత్రాలతో దరఖాస్తు చేసుకొని, అనుమతి పొందాలని ఖమ్మం పోలీస్ కమిషనర్ విష్ణు యస్. వారియర్ ఓ ప్రకటనలో తెలిపారు. దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసే బాణసంచా దుకాణాలలో వ్యాపారులు నియమ నిబంధనలను కచ్చితంగా పాటించాలని పేర్కొన్నారు. పోలీస్, నగర పాలక, అగ్నిమాపక శాఖలు నిర్దేశించిన ప్రదేశంలో మాత్రమే అనుమతితో దుకాణాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. బాణసంచా విక్రయించే వ్యాపారులతో పాటు, టపాకాయలు కాల్చే ప్రజలు కూడా తగిన జాగ్రత్తలు పాటించాలని తెలిపారు.

ధరఖాస్తుతో పాటు ఏఈ -5 ఫామ్, సెల్ఫ్ అఫిడవిట్, చలానా రిసీప్ట్, ఆధార్ కార్డ్, ఫోటో జతపరచి పోలీస్ కమిషనర్ కార్యాలయంలో అందజేయాలి.

అనుమతి లేకుండా బాణసంచా నిల్వ చేసినా, తయారు చేసినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. దీపావళి సందర్భంగా ఎటువంటి ప్రమాదాలు జరగకుండా బాణసంచా విక్రయదారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు.

# పది పాసైన వారి కోసం రైల్వే ఉద్యోగాలు.. దరఖాస్తులకు గడువు ఈ నెల 31

హైదరాబాద్, అక్టోబర్ 11: పరీక్ష లేని బంపర్ రిక్రూట్‌మెంట్‌ను రైల్వే శాఖ చేపడుతున్నది. పదో తరగతి పాసైన వారికి భారతీయ రైల్వే శాఖ సువర్ణ అవకాశం కల్పిస్తున్నది. వివిధ విభాగాల్లో పనిచేసేందుకు చేపడుతున్న డైరెక్ట్ రిక్రూట్‌మెంట్‌కు దరఖాస్తులను ఈ నెల 31 లో అందజేయాలని సూచించింది.

రైళ్లలో ఉద్యోగం చేయాలనుకునే యువత కసం గొప్ప అవకాశం కల్పిస్తున్నది ఇండియన్ రైల్వేస్. 6265 అప్రెంటీస్ పోస్టులను భర్తీ చేయనున్నారు. వీటిలో సదరన్ రైల్వేలో 3150 అప్రెంటీస్ పోస్టులు, తూర్పు రైల్వేలో 3115 పోస్టులకు రిక్రూట్‌మెంట్ జరుగుతుంది. 24 ఏండ్లలోపు వయసు ఉండి 10వ తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు రైల్వే అధికారిక వెబ్‌సైట్ బవఇతీ.తినిటతిజీనితీజీత్రీలిజీఎఐ.ఇనిఎ.తిని ను సందర్శించి ఈ నెల 31 లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులను అందజేయాల్సి ఉంటుంది. ఈ బంపర్ రిక్రూట్‌మెంట్‌లో అభ్యర్థులను ఎలాంటి పరీక్ష లేకుండా నేరుగా ఎంపిక చేస్తారు.

డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ కోసం జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం అభ్యర్థులు కనీసం 50 శాతం మార్కులతో 10వ తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణులై ఉండాలి. ఏదేని గుర్తింపు పొందిన సంస్థ నుంచి సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ కోర్సుల్లో పాసై ఉండాలి. దరఖాస్తు చేయడానికి అభ్యర్థులు 2022 మే 1 నాటికి కనిష్ట వయస్సు 15, గరిష్ట వయోపరిమితి 24 సంవత్సరాలుగా ఉండాలి. రిజర్వుడ్ క్యాటగెరీలకు సడలింపు ఉంటుంది.

మెట్రిక్యులేషన్, ఐటీఐ కోర్సుల్లో సాధించిన మార్కుల సగటు ఆధారంగా మెరిట్ జాబితాను తయారు చేసి ఉద్యోగాలిస్తారు.

# ఎన్నికల కమిషన్‌కు షిండేవర్గం గుర్తుల జాబితా

ముంబై, అక్టోబర్ 11: ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేన కూటమి ఎన్నికల కమిషన్‌కు మరో మూడు గుర్తులను ఎంపిక చేసి పంపింది. శివసేన పార్టీ రెండువర్గాలు విడిపోయిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఉద్ధవ్ వర్గం, ఏక్‌నాథ్ షిండే వర్గాలు అసలైన శివసేన మాదంటే మాది అంటూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ నెలలో అంధేరీ ఈస్ట్ అసెంబ్లీ నియోజకవర్గ స్థానానికి ఎన్నికలు జరుగనున్నాయి. ఈ క్రమంలో ఇరువర్గాలు శివసేన ఎన్నికల గుర్తు విల్లు-బాణం గుర్తును తమకే కేటాయించాలని ఇరువర్గాలు ఎన్నికల కమిషన్‌ను కోరాయి. దీంతో ఈసీ పార్టీ పేరుతోపాటు ఎన్నికల గుర్తును ఇరువర్గాలు వాడకుండా ఫ్రీజ్ చేసింది.

ఎన్నికల సందర్భంగా ఇరువర్గాలు పార్టీ పేరు, ఎన్నికల గుర్తులకు సంబంధించి ఆప్షన్స్ ఇస్తే.. అందులో ఏదో ఒకటి కేటాయిస్తామని చెప్పింది. ఉద్ధవ్ ఠాక్రే వర్గానికి శివసేన ఉద్ధవ్ బాలాసాహెబ్ ఠాక్రే' పేరు, 'కాగడా' గుర్తును ఎన్నికల కమిషన్ ఖరారు చేసింది. ఏక్‌నాథ్ షిండే వర్గానికి 'బాలాసాహెబ్‌చీ శివసేన' పేరును ఖరారు చేసి, ఎన్నికల గుర్తు కోసం మరో మూడు గుర్తులను ఎంచుకొని పంపాలని సూచించింది. దీంతో మరోసారి షిండే వర్గం షైనింగ్ సన్, కవచం కత్తి, పీపల్ వృక్షం గుర్తులను ఎంపిక చేసి.. ఎన్నికల కమిషన్‌కు పంపింది. అంతకు ముందు త్రిశూలం, గద గుర్తులను కేటాయించగా.. ఇరువర్గాలు కోరగా.. వాటిని కేటాయించేందుకు ఈసీ నిరాకరించింది.

# రైల్వే జోన్‌పై విజయసాయిరెడ్డి ఎందుకు రాజీనామా చేయలేదు.. అయ్యన్న పాత్రుడు

అమరావతి: అక్టోబర్ 11:రైల్వే జోన్ పై రాజీనామా చేస్తానన్న విజయసాయిరెడ్డి ఎందుకు చేయలేదని మాజీ మంత్రి, టీడీపీ నేత అయ్యన్నపాత్రుడు ప్రశ్నించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ? ఉత్తరాంధ్ర గర్జన ఎందుకో వైసీపీ చెప్పాలని డిమాండ్ చేశారు. వైసీపీ పాలనలో రాష్ట్రంలో ఏం అభివృద్ధి చేశారో చెప్పాలన్నారు. స్టీల్ ప్లాంట్, గన్నవరం పోర్ట్, పోలవరంపై ఎందుకు గర్జించలేదని నిలదీశారు. విశాఖకు ఒక ప్రాజెక్ట్ అయిన తీసుకోచ్చారా అని ప్రశ్నించారు.

రేపో మాపో కేజీహెచ్ పేరును కూడా భారతి కేజీహెచ్ గా మారుస్తారేమో అని ఎద్దేవా చేశారు. సరైన అవగాహన లేకుండా జగన్ పాలన చేస్తున్నారని విమర్శించారు. దోచుకోవడానికే ఏ-2 విజయసాయిరెడ్డి విశాఖకు వచ్చారని తీవ్రస్థాయిలో ఆరోపణలు చేశారు. భోగాపురం ఎయిర్ పోర్టు వద్ద బినామీల ద్వారా లక్ష గజాల స్థలం కొన్నారని తెలిపారు.ఎన్టీఆర్ యూనివర్సిటీ పేరు మార్చారని అయ్యన్నపాత్రుడు అన్నారు.

# సిబ్బంది సమన్వయంతో పనిచేయాలి

హైదరాబాద్, అక్టోబర్ 11: ప్రజారోగ్యానికి ప్రభుత్వం కోట్లాది రూపాయలను వెచ్చిస్తున్నదని, అమలు చేసే విభాగాల మధ్య సమన్వయలోపం ప్రజలకు ఏమాత్రం ఆటంకంగా పరిణమించకూడదని విప్ గాంధీ పేర్కొన్నారు. స్వచ్ఛమైన పరిసరాల కోసం కలిసి కట్టుగా పనిచేయాలని సూచించారు. చందానగర్ శేరిలింగంపల్లి సర్కిళ్ల పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణపై సదరు విభాగం అధికారులు రాంకీ సంస్థతో కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి విప్ గాంధీ మియాపూర్ క్యాంపు కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పారిశుద్ధ్య నిర్వహణ సరిగా లేదంటూ చెత్త కుప్పల తొలగింపును పకడ్బందీగా చేపట్టడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాంకీ పారిశుద్ధ్య విభాగాలు సమన్వయంతో పని చేసి వీధులలో ఎప్పటికప్పుడు చెత్తను తొలగించాలన్నారు. ఈ విషయంపై అలక్ష్యాన్ని ఏమాత్రం సహించబోనని విప్ స్పష్టం చేశారు. వర్షాలకు చెత్త డ్రైనేజీలు, నాలాల్లో చేరుతూ వరద నీటి ప్రవాహానికి ఆటంకం కలుగుతూ ముంపు ప్రమాదం నెలకొంటున్నదన్నారు. సంబంధిత అధికారులు తగు పర్యవేక్షణ చేపట్టి మెరుగైన పరిసరాలను నెలకొల్పాలని విప్ గాంధీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు నగేశ్, కార్తిక్, జలంధర్‌రెడ్డి, శ్రీనివాస్, మహేశ్, శ్రీనివాసరెడ్డి, కనకరాజు, బాలాజీ, గంగిరెడ్డి, బాలరాజు, కృష్ణ, కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

# సులభతర వాణిజ్య నిర్వహణలాగే సుఖమయ జీవనం కూడా ముఖ్యం



న్యూఢిల్లీ, అక్టోబర్ 11: కేంద్రపాలిత ప్రాంతం లడఖ్‌లోని లేహ్‌లో అక్టోబరు 10నుంచి 12వరకూ జరుగుతున్న 11వ సుస్థిర పర్వతాభివృద్ధి శిఖరాగ్ర సదస్సు, (ఎస్.ఎం.డి.ఎస్.-11) ప్రారంభ కార్యక్రమానికి కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ హాజరయ్యారు. 'సుస్థిర పర్వతాభివృద్ధి కోసం పర్యాటకాన్ని వినియోగించుకోవడం' అనే ఇతివృత్తంతో ఈ శిఖరాగ్ర సదస్సును నిర్వహిస్తున్నారు. వాతావరణం సామాజిక-పర్యావరణ, సుస్థిరత సాధనలో పర్యాటక రంగం సహకారాన్ని సానుకూలంగా ఉపయోగించుకోవడం, పర్యావరణంపై పర్యాటక రంగం ప్రతికూల ప్రభావాలను తగ్గించడం వంటి అంశాలపై ఈ శిఖరాగ్ర సమావేశంలో ప్రధానంగా దృష్టిని కేంద్రీకరిస్తున్నారు.

శిఖరాగ్ర సదస్సు ప్రారంభ సమావేశంలో కేంద్రమంత్రి మాట్లాడుతూ, లడఖ్‌లోని అందమైన ప్రకృతి దృశ్యాలు, అద్భుతమైన పర్వతాల కారణంగా ఆ ప్రాంతాన్ని ఎప్పుడు సందర్శించినా ఆ అనుభవం తాజాగా, నూతనంగా అనిపిస్తుందన్నారు. వైజ్ఞానిక శాస్త్రం, విధానాల ఏకీకరణ అనేది భారతీయ పర్వతారోహణ సంస్థ (ఐ.ఎం.ఐ.) యొక్క ప్రధాన కార్యక్రమం కావాలని అన్నారు. వివిధ సంస్కృతుల, పరిసర పర్యావరణాల ప్రత్యేకతలను ఏకీకృతం చేయడమే ఇలాంటి శిఖరాగ్ర సదస్సుల ప్రధానాంశం కావాలని ఆయన సూచించారు. కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పండిత గోవింద్ వల్లభ్ పంత్ జాతీయ హిమాలయ పర్యావరణ అధ్యయన సంస్థ (జి.బి.పి.ఎన్.ఐ.హెచ్.ఇ.) ఏర్పాటును, లేహ్ నగరంలో ఈ సంస్థ అనుబంధంగా ప్రాంతీయ కేంద్రం ఏర్పాటును ఆయన ఈ సందర్భంగా ప్రత్యేకంగా ప్రస్తావించారు. హిమాలయ పర్యావరణం మనుగడ లక్ష్యంగా పరిశోధన-అభివృద్ధి కార్యకలాపాలను ఈ సంస్థ తప్పనిసరిగా నిర్వహించేలా మంత్రిత్వ శాఖ నిర్దేశించింది. హిమాలయాలు, పశ్చిమ కనుమలు, థార్ ఎడారి వంటి వివిధ ప్రత్యేక ప్రకృతి దృశ్యాలపై వైజ్ఞానిక, శాస్త్రీయ సమాజం ప్రత్యేకంగా శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందన్నారు. యువత సామర్థ్యాన్ని పెంపొందించడం అనేది ఈ కార్యక్రమంలో మరొక ముఖ్యమైన అంశమని అన్నారు. తద్వారా, కేవలం ఉపాధి కోసం అక్షరాస్యత అన్న అంశంపై మాత్రమే కాకుండా స్థానిక సంస్కృతి పరిరక్షణ, పర్యావరణ పరిరక్షణ, యువతలో శాస్త్రీయ సమగ్రతను పెంపొందించడంపై వంటి విషయాలపై దృష్టి సారించేందుకు అవకాశం ఉంటుందన్నారు. కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని జి.బి.పి.ఎన్.ఐ.హెచ్.ఇ., జెడ్.ఎస్.ఐ., బి.ఎస్.ఐ., డబ్ల్యు.ఐ.ఐ. వంటి పరిశోధనా, అభివృద్ధి సంస్థలు అనేక అంశాలపై విస్తృత పరిశోధన, అధ్యయనం నిర్వహిస్తూ వస్తున్నాయన్నారు. వేగవంతమైన ఉత్పత్తికోసం మొక్కల జన్యుశాస్త్రం, భారతీయ వృక్షజాలం, జంతుజాలం ??లెక్కల డిజిటలీకరణ, పర్యావరణ సంబంధమైన పొరపాట్లను సరిదిద్దడానికి దేశంలో చిరుతలను తిరిగి ప్రవేశపెట్టడం వంటి పలు రకాల అంశాలపై ఈ సంస్థలు పరిశోధనలు చేస్తున్నాయన్నారు.

దేశంలోని మారుమూల ప్రాంతాలకు కూడా ఆర్థిక అక్షరాస్యత, సమగ్రమైన సామర్థ్యాల నిర్మాణం లక్ష్యంగా స్కిల్ ఇండియా వంటి పథకాలు, నేషనల్ కెరీర్ సర్వీస్ పోర్టల్, ఇ-శ్రమ్ పోర్టల్, ఉద్యమి, అసీమ్ (ఎ.ఎస్.ఇ.ఇ.ఎం.) తదితర పోర్టల్‌లను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. నేషనల్ కెరీర్ సర్వీస్ పోర్టల్ ఇప్పటికే కోటి మంది దరఖాస్తుదారులను 10 లక్షల మంది యజమాన్య సంస్థలను కలిగి ఉందన్నారు. ఇప్పటివరకూ ఈ పోర్టల్ 4.28 లక్షల ఉపాధి అవకాశాలను అందించిందని, ఇప్పటివరకు ఇదే అతిపెద్ద పోర్టల్. మరింత సామర్థ్యంతో ఈ పోర్టల్‌ను నవీకరిస్తున్నారని అన్నారు. సులభతర వాణిజ్య నిర్వహణ (ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) ఎంత ముఖ్యమో, సౌకర్యవంతమైన జీవనం కూడా మనకు అంతే ముఖ్యమని, కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ ఈ లక్ష్యంకోసమే పనిచేస్తోందని భూపేందర్ యాదవ్ చెప్పారు. పర్యావరణహితమైన జీవన శైలిని ప్రపంచం యావత్తూ అనుసరించాలని గ్లాస్గో నగరంలో జరిగిన వాతావరణ సదస్సు (కాప్-26 సదస్సు)లో ప్రధానమంత్రి పిలుపునిచ్చారని ఆయన గుర్తుచేశారు. వనరులను విచక్షణారహిత వినియోగాన్ని కాక వివేచనతో కూడుకున్న వినియోగాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. ఇటువంటి ప్రక్రియలకు సంబంధించిన భావనలు మన సంస్కృతీ, సంప్రదాయాలలో ఇప్పటికే అందుబాటులో ఉన్నాయన్నారు. దుర్గమమైన హిమాలయ పర్వత ప్రాంతాల్లో కఠినమైన వాతావరణ పరిస్థితుల మధ్య నివసించే ప్రజలు ఇలాంటి విలువలను కలిగి ఉంటారని, ఈ ప్రాంతం పర్యాటకానికి మాత్రమే కాకుండా సాంస్కృతిక సామరస్యానికి కూడా ప్రసిద్ధి చెందిందని అన్నారు. ఒత్తిడి, నిరాశా నిస్పృహలు, ఆందోళనతో నిండిన ఈ ప్రపంచంలో శాంతికి చిహ్నంగా ఉన్న బౌద్ధ విహారాలు వంటివి మనకు అందుబాటులో ఉన్న సానుకూల అంశాలని ఆయన అన్నారు.

పర్యావరణ దౌర్బల్యం, క్రీడలు, పర్వతారోహణ, సైక్లింగ్, శాంతి మొదలైన అంశాలను దృష్టిలో ఉంచుకుని దేశంలో పర్యాటకాన్ని వివిధ కోణాల్లో విస్తరింపజేయాలని కేంద్ర మంత్రి పిలుపునిచ్చారు. అడవులు ఆనందానికి మాత్రమే కాదు శాంతికి ముఖ్యమైన మూలాలు అనే తీర్మానాన్ని ఇటీవల అమెరికాలో జరిగిన ప్రపంచ అటవీ సదస్సు ఆమోదించిందన్నారు. హిమాలయ ప్రాంతపు అడవులు ఎన్నో శతాబ్దాలుగా శాంతిని ప్రోత్సహిస్తూ వస్తున్నాయని. ప్రకృతి అన్వేషకులు, యాత్రికులు, ఆధ్యాత్మిక అన్వేషకుల కోసం హిమాలయాలలో పర్యాటకాన్ని ప్రోత్సహించాలని ఆయన అభిప్రాయపడ్డారు. లడఖ్ లాగానే, హిమాలయాలలోని మణిపూర్, నాగాలాండ్, మేఘాలయ మొదలైన ఇతర రాష్ట్రాలు కూడా పర్యాటకంలో విలీనం చేయవలసిన ప్రత్యేకతలను కలిగి ఉన్నాయని అన్నారు. పర్యావరణ హితమైన పర్యాటకాన్నిమాత్రమే కాక బాధ్యతాయుతమైన పర్యాటకాన్ని ప్రోత్సహించడం కూడా నేటి అవసరమని. అటువంటి కార్యక్రమాలను ఏకీకృతం చేయడానికి పర్యాటకంలో స్థానిక సంఘాల ప్రమేయం చాలా ముఖ్యమని అన్నారు.

పర్యావరణ హితమైన మన కార్యకలాపాలన్నీ సంవత్సరం పొడవునా కొనసాగుతూ ఉండాలని, విద్యా సంస్థలు అందుకు అనుగుణమైన పాఠ్యాంశాలను కలిగి ఉండడం. సాంస్కృతిక- స్థానిక వారసత్వాన్ని పరిరక్షించడం, లడఖ్ వనరులను రక్షించడం, అపరిష్కృతంగా ఉన్న అన్ని సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించడం చాలా ముఖ్యమని ఆయన అభిప్రాయపడ్డారు. స్థానిక టూరిస్ట్ గైడ్‌ల బాధ్యత గురించి ఇలాంటి శిఖరాగ్ర సమావేశాలలో చర్చిస్తే అది వారిపై కూడా దీర్ఘకాలిక ప్రభావాన్ని చూపుతుందన్నారు. లడఖ్ అభివృద్ధి ప్రక్రియను వేగవంతం చేయడానికి, పరివేష్ పోర్టల్‌లో పొందుపరిచిన వన్యప్రాణులకు సంబంధించిన అన్ని ప్రతిపాదనలు, అప్లికేషన్లను తమ మంత్రిత్వ శాఖ ఇప్పటికే పరిష్కరించిందన్నారు. అన్ని పర్యావరణ అనుమతులను కేంద్రీకృత పద్ధతిలో ఏకీకృతం చేసేందుకు వీలుగా పరివేష్ పోర్టల్‌ను తీర్చిదిద్దుతున్నామని అన్నారు. అటవీ హక్కులు, సంబంధిత ఇతర అంశాలపై స్థానిక భాగస్వామ్య వర్గాలకు అవగాహన, శిక్షణ కోసం చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందుకోసం లడఖ్ పరిపాలనా యంత్రాగానికి తమ మంత్రిత్వ శాఖ అన్నిరకాల మద్దతును అందజేస్తుందని ఆయన హామీ ఇచ్చారు.

పలు రకాల శక్తి వనరులల్లో సౌరశక్తి అనేది అతి విస్తృతమైనదని, సౌరశక్తిని ప్రోత్సహించడానికి మన ప్రధానమంత్రి ప్రపంచవ్యాప్తంగా పలురకాల చర్యలు తీసుకున్నారని ఆయన చెప్పారు. అంతర్జాతీయ సౌర కూటమిని భారతదేశం ప్రారంభించిందని, కూటమిలో ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా 106 మంది సభ్యదేశాలు ఉన్నాయని అన్నారు. "ఒక సూర్యుడు, ఒక ప్రపంచం, ఒకే గ్రిడ్" అనే భావనను ప్రధానమంత్రి గ్లాస్గో వాతావరణ సదస్సులో ప్రధానంగా ప్రస్తావించారని, ఈ ప్రతిపాదనను అంతర్జాతీయ సమాజం కూడా ప్రశంసించిందని అన్నారు. వాతావరణ మార్పులతో పరిణమించే నష్టం, సంబంధిత సమస్యను పరిష్కరించడానికి ప్రకృతి విపత్తుల ప్రతిఘటనా మౌలిక సదుపాయాల సంకీర్ణ కూటమి (సి.డి.ఆర్.ఐ.)ని భారతదేశం ఏర్పాటు చేసిందని, యునైటెడ్ కింగ్‌డమ్‌తో కలసి మనదేశం ఈ కూటమిని ఏర్పాటు చేసిందని అన్నారు.

ప్రకృతి సుందర దృశ్యాలతో కూడిన సుదూర ప్రాంతాలను అనుసంధానించేందుకు చేపట్టిన అటల్ సొరంగ మార్గం పనులు, జోజి లా సొరంగం వంటి వాటిని నిర్మించడంతో పర్వత ప్రాంతాల వాతావరణంపై కర్బన ఉద్గారాల ఒత్తిడి తగ్గగలదని కేంద్రమంత్రి తెలియజేశారు. మన దేశానికి సుస్థిర భవిష్యత్తును నిర్ధారించేందుకు సిసలైన, స్ఫూర్తిమంతమైన జీవన సూత్రాన్ని యువత అనుసరించాలని ఆయన సూచించారు. "కర్బన రహితమైన లడఖ్" కోసం ప్రధానమంత్రి కన్న కలలను సాకారంచేయగలమన్న విశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేశారు. " జాతీయ హితం గురించి ప్రతి వ్యక్తి ఆలోచించినప్పుడు, ప్రతి దేశం ప్రపంచహితాన్ని లక్ష్యంగా చేసుకున్నపుడు, సుస్థిర అభివృద్ధి వాస్తవ రూపం దాల్చుతుంది" అని కేంద్ర మంత్రి తన ముగింపు ప్రసంగంలో ప్రధానమంత్రి వ్యాఖ్యలను ఉటంకించారు.

సుస్థిర పర్వతాభివృద్ధి శిఖరాగ్ర సదస్సు (ఎస్.ఎం.డి.ఎస్.) అనేది భారతీయ పర్వతారోహక అధ్యయన సంస్థ (ఐ.ఎం.ఐ.) నిర్వహించే ప్రధాన వార్షిక కార్యక్రమం. భారతీయ హిమాలయ పర్వత ప్రాంతం (ఐ.హెచ్.ఆర్.) పరిధిలోని 10 పర్వత రాష్ట్రాలు, రెండు కేంద్రపాలిత ప్రాంతాలు, నాలుగు కొండ ప్రాంతపు జిల్లాలను కలిగి ఉన్న పౌర సమాజం నేతృత్వంలోని వేదికగా ఇది పనిచేస్తోంది. కేంద్ర స్థాయిలో జరిగే ఈ సదస్సుతో పాటుగా, పర్వత ప్రాంత శాసనసభ్యుల సమావేశం, భారతీయ హిమాలయ యువజన శిఖరాగ్ర సదస్సును కూడా క్రమం తప్పకుండా నిర్వహిస్తూ వస్తున్నారు.

# కేసీఆర్ లేకపోతే బువ్వ లేదు.. బట్ట లేదు.. ఓ వృద్ధుడి భావోద్వేగం..



నల్లగొండ, అక్టోబర్ 11: మునుగోడు నియోజకవర్గం ఉప ఎన్నిక ప్రచారంలో భాగంగా రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు చండూరు మున్సిపాలిటీలోని 2, 3 వార్డుల ఇంచార్జీగా ప్రచార బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఈ సందర్భంగా మంత్రి మంగళవారం 3వ వార్డులో ఇంటింటి ప్రచారం చేస్తూ.. ఓ ఇంటికి వెళ్లగా, ఒక వృద్ధుడు మంత్రిని సైతం అబ్బురపరిచేలా మాట్లాడుతూ.. భావోద్వేగానికి లోనయ్యాడు.

ఆయన లేకపోతే బువ్వ ఎక్కడిది? ఆయన వచ్చినంకనే బువ్వ! ఆయన లేక పోతే బువ్వ లేదు, బట్ట లేదు!! 60, 70 ఏండ్ల కానుంచి ఆయన లాగా చేసిన మొనగాడే లేడు. ఆయన పోయిన తెల్లారి బువ్వ దొరకదు. ఆయన రావాలి. అందరికీ చెప్పుకుంట వత్తాన! ఆయన ఉంటేనే అన్ని?అని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుకు ఆ వృద్ధుడు చెప్పాడు.

# ఆధార్, ఓటరు కార్డుల ..అనుసంధాన ప్రక్రియ వేగవంతం

హైదరాబాద్, అక్టోబర్ 11: డూప్లికేట్ ఓట్లను నివారించేందుకు చేపట్టిన ఆధార్ ఓటరు కార్డుల అనుసంధాన ప్రక్రియను జీహెచ్‌ఎంసీ వేగవంతం చేసింది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలో కోటి మందికి పైగా ఓటర్లున్నారు. ఒక్క జీహెచ్‌ఎంసీ పరిధిలోనే 89 లక్షల మంది ఉన్నారు. జీహెచ్‌ఎంసీ కమిషనర్ హైదరాబాద్ జిల్లాకు, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలకు ఆయా జిల్లాల కలెక్టర్లు ఎన్నికల అధికారులు, ఎన్నికల విభాగం అధికారులు , సిబ్బంది గడిచిన రెండున్నర నెలలుగా ఓటర్లకు ఆధార్ అనుసంధానంపై అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా ఇప్పటి వరకు దాదాపు లక్ష వరకు ఆధార్ కార్డులను అనుసంధానం చేశారు. ఈ క్రమంలోనే ఓటర్లలో విస్తృత అవగాహన కల్పిస్తూ అనుసంధానంపై క్షేత్రస్థాయిలో ప్రత్యేక సిబ్బందిని రంగంలోకి దింపి అనుసంధానం ప్రక్రియను వేగవంతం చేశారు. ఆధార్ లేదా మరో 10 గుర్తింపు కార్డుల్లో ఏదో ఒక కార్డుతో ఓటరు కార్డును అనుసంధానం చేసుకోవాలని కోరుతున్నారు. గూగుల్ ప్లేస్టోర్‌లో కేంద్ర ఎన్నికల సంఘానికి సంబంధించిన ఓటరు హెల్ప్‌లైన్ అప్లికేషన్ ఉంటుందని, అందులో ఓటరు గుర్తింపు కార్డు సంఖ్య (ఎపిక్ నంబరు)ను పొందుపరిచి ఆధార్‌తో అనుసంధానం చేసుకోవచ్చునని చెబుతున్నారు. ఎన్‌వీఎస్‌పీ వెబ్‌సైట్‌లోనూ అనుసంధానం చేసుకోవచ్చునని సూచిస్తున్నారు.

**స్వచ్ఛందంగా చేసుకోండి ..**

ఓటరు జాబితాలో బోగస్, డూప్లికేట్ పేర్లను లేకుండా చేసేందుకు భారత ఎన్నికల సంఘం ఓటరు జాబితాలోని పేరుకు అనుసధానాన్ని స్వచ్ఛందంగా చేసుకునేందుకు ప్రజా ప్రాతినిధ్యం చట్టాన్ని సవరించినట్లు హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ తెలిపారు. జనవరి1, 2023 నాటికి 18 సంవత్సరాలు వయస్సు పూర్తయిన వారంత ఓటరు నమోదు చేసుకోవాలని కమిషనర్ కోరారు. నూతన ఓటరుగా నమోదు చేసుకునే వారంతా ఆన్‌లైన్‌లో చిచిచి.ఔఙాఖ.ఎఔలో గానీ, ఓటరు హెల్ప్ లైన్ యాప్‌లో నమోదు చేసుకోవచ్చునని చెప్పారు. ఆఫ్‌లైన్‌లో చేసుకునే వారంతా బిఎల్ఓ, ఈఆర్‌ను సంప్రదించి ఆధార్ అనుసంధానం, నూతన ఓటరు నమోదు ప్రక్రియను చేసుకోవచ్చునని కమిషనర్ తెలిపారు.

# భారత అంకుర సంస్థలు త్వరలో అంతరిక్ష ఉపగ్రహాలతో పాటు ఉపగ్రహ నక్షత్ర రాశుల ద్వారా రాకెట్లను ప్రయోగించనున్నాయి: కేంద్రమంత్రి శ్రీ జితేంద్ర సింగ్

న్యూఢిల్లీ, అక్టోబర్ 11: భారత అంకుర సంస్థలు త్వరలో అంతరిక్ష ఉపగ్రహాలతో పాటు ఉపగ్రహ నక్షత్రరాశులను ప్రయోగించి తమ రాకెట్‌లను ప్రయోగించనున్నాయని కేంద్ర శాస్త్ర, సాంకేతిక మంత్రిత్వ శాఖ, ప్రధానమంత్రి కార్యాలయం, అంతరిక్షం, అటామిక్ ఎనర్జీ శాఖల సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ నేడు తెలిపారు.

ఎల్‌ఈటీ, హెచ్‌ఎఎల్ సంస్థలు దేశీయంగా ఐదు పీఎస్‌ఎల్‌వీలను ఉత్పత్తి చేస్తున్నాయని మంత్రి తెలిపారు. ౠనివచివవ తమ ఉపగ్రహాలను ఇస్రో మరియు ఎన్‌ఎస్ఐఎల్ ద్వారా ప్రయోగించేందుకు సిద్ధంగా ఉందని మంత్రి తెలియజేశారు.

ఇండియన్ స్పేస్ అసోసియేషన్, మొదటి వార్షికోత్సవం సందర్భంగా దిల్లీలో జరిగిన ఇండియా స్పేస్ కాన్‌క్లేవ్‌లో డాక్టర్ జితేంద్ర సింగ్ ప్రసంగించారు. జూన్, 2020లో అంతరిక్ష రంగంలోకి ప్రైవేట్ పరిశ్రమలను తీసుకురావాలనే ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ విప్లవాత్మక నిర్ణయం అనంతరం దేశం యొక్క అంతరిక్ష పర్యావరణ వ్యవస్థ యొక్క రూపురేఖలు పూర్తిగా మారాయని అన్నారు.

డాక్టర్ జితేంద్ర సింగ్ మాట్లాడుతూ, అంతరిక్ష సంస్కరణల ద్వారా దేశంలోని అంకుర సంస్థలు తమ వినూత్న సామర్థ్యాలను ఆవిష్కరించాయన్నారు. అతి తక్కువ కాలంలో కేవలం, మూడు-నాలుగు సంవత్సరాల క్రితం రెండు అంతరిక్ష అంకుర సంస్థల నుండి, నేడు 102 స్టార్టప్‌లు అత్యాధునికమైన అంతరిక్ష శిధిలాల నిర్వహణ, నానో-ఉపగ్రహం, ప్రయోగ వాహనం, గ్రౌండ్ సిస్టమ్స్, పరిశోధన మొదలైన రంగాలలో పాలువంచుకుంటున్నాయి. పరిశోధనాభివృద్ధి, అకాడెమియా, పరిశ్రమల ఏకీకరణతో, ఇస్రో నేతృత్వంలో అంతరిక్ష విప్లవం వచ్చిందని చెప్పడం సురక్షితం అని మంత్రి అన్నారు. ప్రైవేట్ రంగం, అంకుర సంస్థలు సమాంతరంగా ఉన్నాయన్నారు.

డాక్టర్ జితేంద్ర సింగ్ మాట్లాడుతూ, మన యువ ప్రైవేట్ పారిశ్రామిక సంస్థల బలం, వినూత్న సామర్థ్యం రాబోయే కాలంలో ప్రపంచ అంతరిక్ష సాంకేతిక విజ్ఞానంలో ముందంజలో ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. స్పేస్ డొమైన్ అందించే అపరిమిత అవకాశాలను పరిష్కరించడానికి భారత యువ సాంకేతిక నిపుణలు, అంతరిక్ష సాంకేతిక రంగంలో కొత్త అడ్డంకులను అధిగమించగలరని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

అక్టోబర్ 11, 2021న అంతరిక్షం ఉపగ్రహ సంస్థల యొక్క ప్రధాన పరిశ్రమల సంఘమైన- ఇండియన్ స్పేస్ అసోసియేషన్ (ఇస్పా)ని ప్రారంభించిన సందర్భాన్ని డాక్టర్ జితేంద్ర సింగ్ గుర్తుచేసుకున్నారు, ఆ సందర్భంగా ప్రధాని, "అంతరిక్ష సంస్కరణలకు మన విధానం నాలుగు స్తంభాలపై ఆధారపడి ఉంది- నవకల్పనలో ప్రైవేట్ రంగానికి స్వేచ్ఛ, వ్యవస్థను ప్రారంభించే పాత్రలో ప్రభుత్వం, యువతను భవిష్యత్తును సిద్ధం చేయడం, అంతరిక్ష రంగాన్ని సామాన్యుల పురోగతికి వనరుగా చూడడం" అన్నట్లు కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ తెలిపారు.

ఏడాది కన్నా తక్కువ వ్యవధిలో భారత అంతరిక్ష పరిశ్రమ వృద్ధికి అంతర్జాతీయ అనుసంధానతను అభివృద్ధి చేయడంలో, అద్భుతంగా పనిచేస్తున్నందుకు ఇస్పా పాత్రను మంత్రి ప్రశంసించారు. ఇస్పా సభ్యులు విధాన న్యాయవాదాన్ని చేపట్టడంలో, విజ్ఞానం, దృష్టిలో నిమగ్నమై భారతదేశాన్ని అంతరిక్ష రంగంలో ఉన్నతంగా మార్చడానికి నిరంతరం కృషి చేస్తున్నారని ఆయన అన్నారు.

డాక్టర్ జితేంద్ర సింగ్ మాట్లాడుతూ, వాణిజ్యపరమైన అంతరిక్ష ఆధారిత విహారయాత్రల రంగంలో భారతదేశం ముందంజలో ఉండేందుకు భారత ప్రభుత్వ ప్రయత్నాలకు అనుబంధంగా ఇస్పా ప్రధాన పాత్ర పోషిస్తుందని మంత్రి అన్నారు. దీని కోసం, కీలకమైన వాటాదారుల మధ్య పరస్పర చర్యలకు మధ్యవర్తిగా ఇస్పా చేస్తున్న పాత్ర కీలకమైనదని మంత్రి తెలిపారు. ఇండియన్ స్పేస్ అసోసియేషన్ 'ఆత్మనిర్భర్ భారత్' నినాదాన్ని ఉన్నతంగా ఉంచడం వల్ల దేశంలో ముఖ్యమైన సాంకేతిక పురోగతులు, పెట్టుబడులకు నాంది పలుకుతుందని, ఇది అంతిమంగా అధిక నైపుణ్యం కలిగిన ఉద్యోగ అవకాశాలను సృష్టిస్తుందని మంత్రి అన్నారు. అదే సమయంలో అంతరిక్ష సంస్కరణలకు ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాన్ని అనుసరిస్తుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

ఇటీవలి ప్రపంచ పరిణామాల దృష్ట్యా అంతరిక్ష వ్యూహాత్మక ఔచిత్యాన్ని గురించి డాక్టర్ జితేంద్ర సింగ్ మాట్లాడుతూ, అంతరిక్షం ఒక ద్వంద్వ-వినియోగ సాంకేతికత డొమైన్ అన్నారు, అద్భుతమైన అవకాశాలను అందించే ఒక ప్రముఖ బహుముఖ రంగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. అనేక దేశాలు ఈ రోజు తమ సైనిక అంతరిక్ష సామర్థ్యాలను అభివృద్ధి చేయడంపై దృష్టి సారిస్తున్నాయని, దాని సురక్షితమైన, స్నేహపూర్వక వినియోగాన్ని నిర్ధారించడానికి అవసరమైనప్పుడు ప్రత్యర్థులకు దానిని తిరస్కరించే నిరోధక సామర్థ్యాన్ని కూడా పెంపొందించుకుంటున్నాయని మంత్రి అన్నారు.

భారతదేశం కూడా ఈ ఉద్భవిస్తున్న యుద్ధ కోణాన్ని బలపరిచేందుకు సంకల్పించిందన్నారు. వాస్తవానికి, ప్రైవేట్ పారిశ్రామిక సామర్థ్యం సమర్థవంతంగా శక్తివంతం చేసేందుకు అంతరిక్ష రంగంలో ఆత్మనిర్భరతను సాధించేందుకు భారత ప్రభుత్వం బలమైన, నిర్ణయాత్మక చర్యలను చేపడుతోందని అన్నారు. రాబోయే కాలంలో భారత్ ఇతర దేశాలకు అంతరిక్ష సాంకేతికతను అందించే అత్యాధునిక పరిష్కారాలను అభివృద్ధి చేస్తుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా, రక్షణ రంగం మూడు సేవలతో వారి అవసరాలను తీర్చడంలో ఇండియన్ స్పేస్ అసోసియేషన్ పోషించిన నిర్మాణాత్మక పాత్రను డాక్టర్ జితేంద్ర సింగ్ ప్రస్తావించారు. రాబోయే కాలంలో ప్రభుత్వం ఇస్పా సామర్థ్యం, సామర్థ్యాన్ని పెంపొందించే కార్యక్రమాలకు మద్దతు ఇవ్వడంలో చాలా లోతైన పాత్ర పోషిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం ద్వారా అద్భుతమైన ప్రదర్శనను అందించినందుకు ఇస్పా ఛైర్మన్ మరియు డైరెక్టర్ జనరల్‌తో పాటు వారి సభ్యులకు మంత్రి ధన్యవాదాలు తెలిపారు.మంత్రి ఇండియన్ స్పేస్ అసోసియేషన్ ఛైర్మన్, జయంత్ డి పాటిల్, ఇస్రో ఛైర్మన్, ఎ. సోమనాథ్ తో కలిసి "భారతదేశంలో అంతరిక్ష పర్యావరణ వ్యవస్థను అభివృద్ధి చేయడం: సమగ్ర వృద్ధిపై దృష్టి సారించడం" అనే అంశంపై తయారు చేసిన నివేదికను ఆవిష్కరించారు.

సమావేశం ముగింపులో డాక్టర్ జితేంద్ర సింగ్ మాట్లాడుతూ, ఇస్రో యొక్క విజయాలు మనకు ప్రపంచ గుర్తింపు ప్రశంసలను రెండింటినీ సంపాదించిపెట్టాయని అన్నారు. ప్రపంచంలోని అతిపెద్ద రిమోట్ సెన్సింగ్ ఉపగ్రహాల సమూహంతో ఇస్రో ఖగోళ అంతరిక్షంలో ప్రత్యేక స్థానాన్ని పొందడం ఒక గౌరవం అన్నారు. ఇస్రో సాధించిన విజయాలతో భారతదేశం గర్వపడేలా చేస్తుందని మంత్రి ఉద్ఘాటించారు.

# వాణిజ్య సముదాయాలకు ..పక్కాగా పార్కింగ్ ఉండాలి

హైదరాబాద్, అక్టోబర్ 11: సరైన పార్కింగ్ సౌకర్యం లేని వాణిజ్య సముదాయాలు వెంటనే పార్కింగ్ సౌకర్యం ఏర్పాటు చేసుకోవాలని, పార్కింగ్ ఏర్పాట్లు చేసుకోకుండా ట్రాఫిక్ రద్దీకి కారకులయ్యే వారిపై తగిన చర్యలు తీసుకుంటామని రాచకొండ ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాస్ హెచ్చరించారు. రోడ్లపై ట్రాఫిక్ జామ్ చేసి, సామాన్య పౌరులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన రామంతాపూర్‌లోని లాండ్ మార్క్ హోటల్‌పై ఉప్పల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయ్యిందని డీసీపీ వివరించారు. ఆదివారం సాయంత్రం రామంతాపూర్‌లో ల్యాండ్ మార్క్ హోటల్ ప్రారంభోత్సవానికి సినీ నటులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఐదు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ రద్దీ ఏర్పడి, సామాన్య వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు పోలీసులకు చాలా సమయం పట్టింది.

అయితే, ట్రాఫిక్ పోలీసుల నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోలేదు. కనీసం సమాచారం కూడా ఇవ్వలేదని, సామాజిక బాధ్యత లేకుండా ఆ మార్గంలో వెళ్లే వారికి తీవ్ర ఇబ్బందులు కలిగించే విధంగా హోటల్ యాజమాన్యం వ్యవహరించిందని డీసీపీ తెలిపారు. కనీస పార్కింగ్ సౌకర్యాలు లేకుండా ప్రారంభోత్సవం చేయడంతో ట్రాఫిక్ రద్దీ ఏర్పడి.. ప్రజలు ఇబ్బందులు పడ్డారని పేర్కొన్నారు.

ఈ విషయంపై ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదయ్యిందని ట్రాఫిక్ డీసీపీ వెల్లడించారు. అలాగే, ఉప్పల్‌లోని ఓ హోటల్ కూడా సరైన పార్కింగ్ స్థలం లేకుండా కాలనీ వాసులకు ఇబ్బందులు కలిగిస్తుండటంతో నోటీసులు జారీ చేశామన్నారు. యాజమాన్యం స్పందించకపోవడంతో సరైన పార్కింగ్ స్థలం లేకుండా వ్యాపారాన్ని నిర్వహిస్తున్న ఆ హోటల్ అనుమతి రద్దు చేయాలని జీహెచ్‌ఎంసీకి లేఖ రాసినట్లు డీసీపీ వివరించారు. వాణిజ్య సముదాయాలు తమ వ్యాపారాల నిర్వహణ కోసం సరైన పార్కింగ్ సౌకర్యాన్ని కలిగి ఉండాలని డీసీపీ సూచించారు.

ఆయా సముదాయాల వద్దకు వచ్చే ప్రజలు తమ వాహనాలను సరైన పార్కింగ్ స్థలాల్లో నిలిపే విధంగా ఆయా యాజమాన్యాలు చర్యలు తీసుకోవాలని సూచించారు.

